అనుదినం... జనస్వరం

ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | శుక్రవారం 14 ఏప్రిల్ 2023 | www.navatelangana.com

బడుగుల జీవితాల్లో వెలుగులు

ఒకప్పుడు వ్యవసాయ కూలీలుగా ఉన్న బడుగు జీవులు..ఇప్పుడు వారే రైతులుగా మారారు. ఇతరుల భూములను దున్ని సాగు చేసిన దళిత కుటుంబాలు..నేడు వారి సొంత భూమిని సాగుచేసుకుంటూ యజమానులుగా మారుతున్నారు. దళితుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పలు పథకాలు వారి అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయి. దళితబస్తీ, దళితబంధుతో పాటు ఏటా స్వయం ఉపాధి కోసం అందించే రాయితీ రుణాలతో ఆర్థికంగానూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. భూముల పంపిణీతో పాటు పంట పెట్టుబడి, నీటి వసతి కోసం బోర్ల తవ్వకం, చిరువ్యాపారులకు బ్యాంకు రుణాలు తదితర పథకాలు అందించడంతో దళితులు జీవితాల్లో మార్పులు వస్తున్నాయి. శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో దళిత కుటుంబాలు సాధించిన ప్రగతిపై ప్రత్యేక కథనం..

– నవతెలంగాణ, ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

- భూముల పంపిణీతో రైతులుగా మారి
- దళితబంధుతో స్వయం ఉపాధికి దోహదం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలోకి
- ఆర్థిక పరిపుష్టి దిశగా దళితుల జీవితాలు

ఎస్సీల సంక్షేమానికి నిరంతరం కృషి

- త్వరలో రెండో విడత దళితబంధు పథకం
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్



నవతెలంగాణ– ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలోని దళిత కుటుంబాల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు శంకర్ అన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో సంక్షేమ శాఖల ద్వారా దళిత

2లో..

మనువాదంపై మహోద్యమమే అంబేద్కర్‌కు నివాళి

ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14 రానే వచ్చింది. మహనీయుడు అంబేద్కర్ పుట్టిన రోజున జై భీమ్ అని నినదించడం, డీజేలతో ఊరేగింపులు చేయడం, నీలి తోరణాలు కట్టడం అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేయటం అనే తంతు ఈ ఏడాది కూడా జరుగుతుంది. ఏప్రిల్ 14 డిసెంబర్ 6న ఆయన జయంతి వర్ధంతిల సందర్భంగా మాత్రమే అంబేద్కర్ ఆశయాలని స్మరించుకొని మిగిలిన 363 రోజులు ఆయన ఆశయాలకు భిన్నమైన కార్యాచరణలో నిమగ్నం కావడం కూడా ఒక తంతుగా మారుతోంది. ఈ సందర్భంగానైనా అసలు అంబేద్కర్ ఏం చెప్పారు? మన పాలకులు ఏం ఆచరిస్తున్నారు? అంబేద్కర్ ఆశయాన్ని సాధించే వారసులెవరు? వారు ఏం చేయాలి? ఇప్పుడు అందరం నెమరువేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్ అనగానే కేవలం రాజ్యాంగం రాశాడు. రిజర్వేషన్లు ఇచ్చాడు. కాబట్టి ఆయన దళితుల దేవుడని ఆయన పట్ల భక్తి చాటుకోవడానికి చాలా మంది పోటీపడుతున్నారు అంబేద్కర్ ఆశయ పరమవిరోధిగా ఉన్న ఆర్ఎస్ఎస్ బీజేపీ కూడా పూలదండలు వేసి కొబ్బరికాయలు కొట్టడం, తిలకం దిద్దడం వంటి వాటితో సామాజిక సమరస్వత వేదిక అంబేద్కర్ హిందూ పరిషత్, దళిత హిందూ పరిషత్,దళిత మోర్చా పేరుతో ఆర్ఎస్ఎస్, బీజేపీలు కొనియాడుతున్నాయి. అంబేద్కర్ తన తుదిశ్వాస వరకు ఏ మనువాద అంతం కోసం కషి చేశారో ఆయన ఆశయాలకు పరమ విరోధిగా ఉన్న మనువాద శక్తులు కూడా అంబేద్కర్‌ను కొనియాడడం అంటే అంబేద్కర్‌ను హైజాక్ చేయడమే.

అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయం ఎదుట 300 అడుగుల స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు. రష్యా దేశ అధ్యక్షుడు పుతిన్ తన ఛాంబర్‌లో అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాడు. ఐక్యరాజ్యసమితిలో ప్రతి ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అంబేద్కర్ పుట్టిన రోజున ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్‌కు కీర్తి ప్రతిష్టలు పెరుగుతుంటే మనదేశంలో మాత్రం అంబేద్కర్ అంటే అంటరానివాడిగా నడి ఊర్లో కూడా ఆయన విగ్రహం కూడా ఉండటానికి వీలు లేదు అంటే ఆయనను ఎంతగా అవమానిస్తున్నారో గమనించవచ్చు. అంబేద్కర్ మాటల్లో నేను రాసిన రాజ్యాంగం కేవలం ఓటు హక్కు మాత్రమే ఇచ్చి, రాజకీయ స్వాతంత్ర్యాన్ని కల్పించాను కానీ ఆర్థిక సామాజిక స్వాతంత్ర్యాలను దేశంలో అణచివేతకు పీడనకు గురవుతున్న పేదలు పోరాడి సాధించుకోవాలన్నారు. ఆస్తి జాతీయం కాకుండా ఆర్థికంతరాలు తొలగిపోకుండా కుల నిర్మూలన జరగకుండా సామాజిక అణిచివేత అంతం కాదన్నారు. మనుస్మృతి అనే అధర్మశాస్త్రం వేల సంవత్సరాలుగా మెజారిటీ ప్రజలుగా ఉన్న శూద్రులకు చదువు సంపద ఆస్తులు, ఆభరణాలు, అధికారాలు అన్నింటిని దూరం చేసి మెజారిటీ మతమని చెప్పుకునే హిందూమతంలో మైనార్టీ ప్రజలకే మేలు చేసి, మెజారిటీ హిందువులకి తీరని ద్రోహం చేసిందంటాడు అంబేద్కర్. సమాజంలో సగభాగం ఉన్న మహిళా సమానత్వం సాధించకుండా దేశం సమాన అభివృద్ధి సాధించలేదన్నారు. అందుకే మహిళా సమానత్వం కోసం నాడు పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టి దానిని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించనందుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు.

బ్రాహ్మణిజం, క్యాపిటలిజం భారత దేశ ప్రజలకు శత్రువులని ప్రకటించారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ రెండు తలలో విషం నింపుకున్న విషసర్పం. అది బ్రాహ్మణిజాన్ని క్యాప్టలిజాన్ని పెంచిపోషిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమంతో ఏ మాత్రం సంబంధంలేని, జాతీయ జెండాను వ్యతిరేకించి అంబేద్కర్ రాసిన భారతదేశ రాజ్యాంగం ఈ దేశానికి పనికిరాదని ప్రకటించిన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ నేడు దేశ భక్తి జాతీయవాదం అంటూ ఫోజు పెడుతుంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన బీజేపీ మోడీ సర్కార్ ఆ రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయడానికి కుట్రలు చేస్తుంది. అందుకోసమే ఫిబ్రవరి 15న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో మనుస్మృతి మనదేశ ప్రాచీన రాజ్యాంగం అంటూ దానిని ఆవిష్కరించడానికి ప్రయత్నించారు నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ 'మాకు పార్లమెంట్‌లో సంఖ్యాబలం ఉంది. సెక్యులరిజం అనే పదం మాకు నచ్చదు కచ్చితంగా రాజ్యాంగాన్ని మారుస్తాం' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశాడు రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఆయన ఆ రాజ్యాంగం ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడిగా ఎలా కొనసాగుతాడు గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజ్యాంగం కేవలం కాగితం మాత్రమేదానిని ఎప్పుడైనా చింపేస్తాం అది మాకు ముఖ్యం కాదు. హిందూ ధర్మమే మాకు ముఖ్యం అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వారి ఆర్ఎస్ఎస్ బీజేపీ విధానమని నేటి తరం గ్రహించాలి. లాభాలు వచ్చే పాడిఆవు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్ శక్తులకి అమ్ముతున్నారు. ఇప్పటికే 16 కీలక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసింది. ప్రభుత్వ రంగం మొత్తం ప్రయివేటుపరం చేయడం ద్వారా దళిత గిరిజన బలహీన వర్గాలకు అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లకు గండి కొడుతున్నది.

దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం రావలసిన నిధులు రాకుండా ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ చట్టాన్ని నీటి అయోగ్ పేరిట నిర్వీర్యం చేస్తున్నది. దళితుల పేదల కీలక ఉపాధి వనరుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నది. దేశంలో 80 కోట్ల మంది రెక్కల కష్టంపై జీవించే పేదల ఉపాధి కోసం బడ్జెట్‌లో కేవలం 60వేల కోట్ల రూపాయలు కేటాయించి బడా పెట్టుబడిదారీ దారులకు మాత్రం రూ.10లక్షల కోట్ల రాయితీలు ఇచ్చింది. అందుకే బీజేపీ ప్రభుత్వం కోటీశ్వర్లకు కొమ్ముకాస్తూ పేదలకు ద్రోహం చేస్తున్నదని గ్రహించనంత కాలం మనం మోసపోతూనే ఉంటాం.

అంబేద్కర్ విద్యా వైద్యం ఎల్లవేళలా ప్రభుత్వ సంక్షేమ రంగంలో మాత్రమే ఉండాలి ప్రయివేటు పరం కావొద్దు అన్నారు.కానీ కేంద్ర బీజేపీ సర్కారు నూతన విద్యా విధానం ముసుగు ధరించి పక్కా మనువాద విద్యా విధానాన్ని తెచ్చింది. అణగారిన పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తుంది. గో రక్షక దళాల మాటున దేశంలో దళితులు మైనార్టీలపై కిరాతక దాడులు చేస్తుంది. దబోల్కర్ ఫన్సారే కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి మేధావులను కిరాతకంగా హత్యగావించింది బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై 300 రెట్లు హింస పెట్రేగిపోయింది. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీ కులానికి చెందిన వాడని బీజేపీ చెప్పుకుంటుంది. కానీ దేశంలో బీసీల కులగణన చేపట్టకుండా బీసీలకు ద్రోహం చేస్తుంది. కేంద్రంలో సుమారు 10లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే అందులో 2.50 లక్షల పోస్టులు దళిత గిరిజనులవి ఖాళీగా ఉన్నాయని ఏడవ వేతన సంఘం పేర్కొన్నది. వాటిని భర్తీ చేయడం లేదు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని నిరుద్యోగులు నిలదీస్తున్న పెడచెవిన పెడుతున్నది.

మన రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం లౌకికతత్వం ఫెడరలిజం సామాజిక న్యాయం వంటి వాటిపై బీజేపీ ముప్పేటదాడి చేస్తుంది. ప్రశ్నించే గొంతులపై అనేక ఫాసిస్టు చట్టాలను ప్రయోగిస్తుంది. ఉపా వంటి నల్ల చట్టాలను తీసుకొచ్చి తమను ప్రశ్నించిన వారిపైకక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. మహనీయుడు అంబేద్కర్‌ల ఆశయాల సాధన కోసం కృషి చేయడం అంటే వారి జయంతులు వర్ధంతుల్లో దండలు వేసి దండాలు పెట్టి సంబరపడటం మాత్రమే కాదు మతసామరస్యం, దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేయాలి.

భారతమాత అంటే పేపర్‌పై గీసిన బొమ్మ కాదు, భారతీయ మహిళలందరూ భారతమాతలే అనే ఒక విజ్ఞతను చాటాలి. దేశంలోని అమ్మలను ద్వేషించిన పర్వాలేదు కానీ, ఆవులను ప్రేమించాలి అనే నీచ సంస్కృతి పెరుగుతుంది. దీనిని పౌరసమాజం ప్రశ్నించాలి. పురుషులతో మహిళలు సమానమని చాటడం ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా మన మానవీయతను చాటుకోవాలి. దేశభక్తి అంటే ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించడమే కానీ కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టడం కాదు. దేశంలో కులమత విచ్చిన్నాలను రెచ్చగొట్టడం చిచ్చులు పెట్టడడం ఉద్రిక్తతలు విద్వేషాలను రగల్చడం కాదు, దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేయడం. అంబేద్కర్ ఆశయాల అమలుకు మన ముందు ముఖ్యంగా నేడు రెండు కర్తవ్యాలు ఉన్నాయి. రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, మనువాదాన్ని మట్టిలో పాతిపెట్టడమని గుర్తించాలి. అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేస్తూ ఆయన ఆశయాలను సమాధి చేస్తున్న పాలకుల కపట స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఓవైపు సరళీకరణ విధానాలు మరోవైపు మనువాద విధానాలతో దేశాన్ని అన్ని రంగాల్లో సంక్షోభంలోకి నడిపిస్తున్న మనువాద బీజేపీ విధానాలపై మహోద్యమం చేపట్టాలి ఆయన చూపిన సామాజిక న్యాయం దేశంలో అమలు జరగాలంటే భూమి సంపద ఉత్పత్తి వనరులు బడ్జెట్ ప్రకృతి వనరులలో పీడిత వర్గం పట్టు సాధించాలి. యువతరం మనసుపెట్టి ఆలోచించి అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలి.

మార్చి 28న అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూర్ గ్రామంలో ప్రారంభానికి సిద్ధమై ముసుగు వేయబడి ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అదే గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త నిప్పు పెట్టాడు. ఎందుకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు అంబేద్కర్‌పై అంత కోపం వచ్చింది. ఆ గ్రామంలో శివాజీ విగ్రహం, గుడి, పక్కన గ్రామ సచివాలయం ఉన్నాయి. మధ్యలో వివేకానందుడి విగ్రహం నెలకొల్పుతాము. నడి ఊర్లో అంబేద్కర్ విగ్రహం ఎందుకు అది మీ ఎస్సీ కాలనిలో పెట్టుకోండి అని ఆగ్రహంతో నిప్పు పెట్టాడు. ఇది ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త తెలియక చేసిన పని కాదు. ఆర్ఎస్ఎస్‌కు అంబేద్కర్ పట్ల ఉన్న ఆలోచనలకు నిదర్శనమే ఈ దుశ్చర్యగా భావించాలి.

మన రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడం, నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టడడం సంతోషమే. కానీ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ దళితులపై దాడులకు పాల్పడుతుంది ఆర్ఎస్ఎస్ బీజేపీ శ్రేణులే.. రామోజీపేట అల్మాస్ పూర్, గువ్వలేగి, కనిపెట్ట, పొట్టిపల్లి సింగాయపల్లి వంటి గ్రామాలలో ఆర్ఎస్ఎస్ బీజేపీ గుండాలు దళితులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుంది

రాష్ట్రంలో 76కుల దురహంకార హత్యలు జరిగాయి. వీడీసీల పేరిట సాంఘిక బహిష్కరణలు జోగిని వ్యవస్థ నేటికీ కులవక్ష అంటరానితనం దళితులపై దాడులు దౌర్జన్యాలు రెట్టింపు స్థాయిలో పెరుగుతున్నాయి వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో కెవిపిఎస్ రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగాన్ని రక్షించుకుందాం. మనువాదాన్ని మట్టు పెడదాం. రిజర్వేషన్లు బీసీ కులగణన సామాజిక న్యాయం కోసం ఏప్రిల్ 15 నుండి 30 వరకు పూలే అంబేద్కర్ జన జాతరలు నిర్వహిస్తున్నది. మనువాద బీజేపీకి హటావో దేశ్ కే బచావో అనే నినాదంతో ముందుకు సాగుతున్నది. భారతీయులుగా మతోన్మాద, మనువాద శక్తులను ఓడించడానికి ఐక్యం కావడం ద్వారా మనువాదంపై మహోద్యమం చేపట్టడం ద్వారా అంబేద్కర్‌కి మన ఘన నివాళులర్పిద్దాం.

(ఏప్రిల్ 14 డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జయంతి)

టి. స్కైలాబ్ బాబు

ఎస్సీల సంక్షేమానికి నిరంతరం కృషి

▸ మొదటిపేజీ తరువాయి

కుటుంబాలకు వివిధ రకాల పథకాలు అందిస్తున్నామని చెప్పారు. శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని ఎస్సీ సంక్షేమశాఖల ద్వారా జరిగిన ప్రగతిపై నవతెలంగాణతో ముచ్చటించారు.

దళితబస్తీలో రాష్ట్రంలోనే టాప్

జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో ఇప్పటికే దళితబస్తీ పథకంలో భాగంగా 1883 కుటుంబాలకు భూ పంపిణీ చేసి లబ్ధి చేకూర్చాం. వీరికి పంట పెట్టుబడి సాయంతో పాటు బోరుబావుల తవ్వకాన్ని చేపట్టి సాగునీటిని అందిస్తున్నాం. గతంలో గుంట భూమి లేని అనేక కుటుంబాలు నేడు వ్యవసాయం చేస్తూ అభివృద్ధి సాధిస్తున్నాయి. ఈ భూ పంపిణీలో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా మొదటి వరుసలో ఉండటం సంతోషానిస్తోంది. మరోపక్క దళితబంధు పథకంలో ఆదిలాబాద్ జిల్లాలో 249మంది లబ్ధిదారులకు రూ.10లక్షల చొప్పున ఆర్థికం సాయం అందించినట్లు వివరించారు. ప్రభుత్వం త్వరలోనే రెండో విడత దళితబంధు పథకం కింద లబ్ధిదారులకు అందించేందుకు నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఈ ప్రక్రియ ప్రారంభిస్తామని వివరించారు.

స్వయం ఉపాధి కోసం రుణాలు

జిల్లాలోని దళిత కుటుంబాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందిస్తున్నాం. తద్వారా అనేక మంది వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి ఆర్థిక అభివృద్ధిని సాధిస్తున్నారు. చిరువ్యాపారులకు బ్యాంకు షరతులతో సంబంధం లేకుండా రూ.50వేల చొప్పున రుణాలు అందించాం. వీటితో పాటు సంక్షేమ వసతిగృహాల నిర్వహణ, రెసిడెన్సియల్ పాఠశాలలు, ఎస్సీ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ విదేశీవిద్య తదితర పథకాలు అమలు కావడంతో ఆయా వర్గాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి. రానున్న రోజుల్లోనూ ఎస్సీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను లబ్ధిదారుల దరికి చేకూర్చేందుకు శాయశక్తులా కృషిచేస్తామని వివరించారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు

నవతెలంగాణ - ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు అంకురార్పణ చేసింది. దళితుల్లో పేదరికం దూరం చేయడంతో పాటు భూమిలేని నిరుపేదలకు మూడు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేపట్టింది. ఆదిలాబాద్ జిల్లాలో 30,565 షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు ఉండగా వీటి పరిధిలో 1,12,932 జనాభా ఉంది. ఇప్పటి వరకు 11,182 కుటుంబాలు లబ్ధిపొందినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం దళితబస్తీ పథకం కింద ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు రూ.208.27కోట్లతో 1883 కుటుంబాలకు 4787.34 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి అందజేశారు. వీరికి పంట పెట్టుబడి కోసం లబ్ధిదారులకు రూ.8.40కోట్లు అందించారు. వీటితో పాటు ఈ భూములతో పాటు అసైన్డ్, పట్టా భూములకు నీటి వసతి కల్పించడం కోసం 375 బోరుబావులు మంజూరు చేశారు. ఇందులో 244 బోరుబావులకు డ్రిల్లింగ్ పనులు పూర్తిచేశారు. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కోసం 97 రకాల పథకాలు అందించారు. 3632మంది లబ్ధిదారులకు



ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, బ్యూటీపార్లర్లు, టెంట్‌హౌజ్ తదితర వాటిని నెలకొల్పేందుకు రూ.68.12కోట్లు స్వయం ఉపాధి రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశారు. మిగితా రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలను వర్తింపజేస్తుండటంతో దళిత లబ్ధిదారుల జీవితాల్లో మార్పులు కనిపిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దళితబంధుతో ఆర్థిక అండ..!

ప్రభుత్వం దళితబస్తీ పథకంలో భూ పంపిణీ చేపట్టడం ద్వారా ఇది వరకు రైతు కూలీలుగా ఉన్న అనేక మంది ప్రస్తుతం భూ యజమానులుగా మారారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఈ పథకం వెలుగులు తీసుకొచ్చింది. ముఖ్యంగా ప్రభుత్వం ఏడాది కిందట దళితబంధు పేరిట మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. తొలి విడతలో నియోజకవర్గానికి 100 కుటుంబాల చొప్పున ఈ సాయం అందించగా ఉమ్మడి జిల్లాలో వెయ్యి కుటుంబాలకు రూ.వంద కోట్లను అందించింది. ఈ నిధులతో వివిధ రకాల యూనిట్లు స్థాపించి స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇచ్చారు. ఈ పథకంలో లబ్ధి పొందిన వారంతా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. ముఖ్యంగా రెండో విడత దళితబంధు సాయం అందించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇది వరకే వివిధ రకాల చిరువ్యాపారం చేసుకొని జీవించే వారికి బ్యాంకు షరతులతో సంబంధం లేకుండా ఆదిలాబాద్ జిల్లాలో 263 మంది లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున రూ.1.31కోట్ల బ్యాంకు రుణాలను అందించి ఆర్థిక తోడ్పాటునందించారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-హుజురాబాద్: చెల్పూర్ సర్పంచ్ నేరెళ్ల మహేందర్ గౌడ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం హుజరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హుజురాబాద్ మండలం చెల్పూరు గ్రామ సర్పంచ్ నేరెళ్ళ మహేందర్ గౌడ్ గ్రామంలో ఎన్నో మంచి పనులు చేశారని .. కొంతమంది వ్యక్తులు కావాలని ఆయనపై తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. అధికార పార్టీ వ్యతిరేకంగా ఉన్నాడనే కక్ష్యతో పోలీసుల సహాయంతో తప్పుడు కేసు బనాయించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నవతెలంగాణ- జమ్మికుంట: పట్టణంలోని పాత మార్కెట్ ఏరియా ప్రాంతంలో గుడివాడ పుల్లారావు బజ్జీల బండి వ్యాపారి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు జమ్మికుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే .. పట్టణానికి చెందిన గుడివాడ పుల్లారావు తన కుటుంబంతో సహా ఈనెల 8వ తేదీన శుభకార్యం నిమిత్తం తమ స్వగ్రామమైన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు వెళ్లారు. ఈ నెల 12న రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటికి తాళం తీసి ఉంది. ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. జమ్మికుంట పోలీసులు వచ్చి విచారణ చేపట్టినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా దొంగతనం జరిగిందని బాధితులు గుడివాడ పుల్లారావు కుమారుడు గుడివాడ సుధాకర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంగతనం జరిగిన ప్రాంతాన్ని క్లూస్ టీం ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్ తీసుకున్నామని... బాధితులు నాలుగు తులాల బంగారం, తులం వెండి, 15 వేల నగదు పోయిందని దరఖాస్తు ఇచ్చారని చెప్పారు. దానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.



క్లూస్ టీంతో పరిశీలిస్తున్న పట్టణ సీఐ

రామకృష్ణ కాలనీలో దొంగల బీభత్సం

నవతెలంగాణ- తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీలో సిరికొండ రామారావు అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగలగొట్టి దాదాపు 15 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం రామారావు కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. రామారావు ఫిర్యాదు మేరకు క్రైమ్, సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టారు.



విచారణ జరుపుతున్న పోలీసులు

ఆలయానికి విరాళం అందజేత

నవతెలంగాణ- తిమ్మాపూర్: మన్నెంపల్లి గ్రామానికి సంబంధించిన ముదిరాజ్ కుల సంఘం సభ్యులు నిర్మించుకుంటున్న పెద్దమ్మ తల్లి దేవాలయం కోసం తన వంతు సహాయంగా తిమ్మాపూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, నుస్తులాపూర్ సర్పంచ్ రావుల రమేష్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు ఆలయానికి వేసేందుకు పెయింట్స్ పంపించారు. వాటిని మన్నెంపల్లి ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, కుల సంఘం అధ్యక్షులు, సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రావుల రమేశ్‌కు ముదిరాజ్ కులస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



పేయింట్స్ అందజేస్తున్న ఉపసర్పంచ్ అనిల్ గౌడ్

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-తిమ్మాపూర్:
ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాల మేరకు తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. మొదటగా తిమ్మాపూర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పోతురాజుల దేవేందర్ ను నియమించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసి ఉండి, శక్తి వంచన లేకుండా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా పోతురాజుల దేవేందర్ నియామకం కావడంతో పార్టీ కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఅర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు దుంద్ర రాజయ్య యాదవ్, నాయకులు పోతుగంటి వీరెందర్, వేల్పుల మల్లయ్య, మాతంగి లక్ష్మణ్, ఎడ్ల బుచ్చిరెడ్డి, నగునూరి బాబు, గాజ సాగర్, పాశం అశోక్ రెడ్డి, కేతిరెడ్డి తిరుపతి రెడ్డి, బొర్ర రవి, మాతంగి అంజయ్య, గడ్డి రమేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దేవేందర్‌ను అభినందిస్తున్న నాయకులు

యువత భవితకు ప్రతిమ ఫౌండేషన్ కృషి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్

నవతెలంగాణ-కరీంనగర్:
యువతీ, యువకుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకే ప్రతిమ ఫౌండేషన్ వారధి స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ అన్నారు. నిరుద్యోగ యువతను వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు కరీంనగర్‌లో 5 సంవత్సరాల క్రితం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారధి స్టడీ సెంటర్‌ను మేయర్ సునీల్ రావుతో కలిసి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ సందర్శించారు. పోటీ పరిక్షల కోసం చదువుతున్న యువతీ యువకులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షల పరిజ్ఞానానికి ఉపయోగపడేలా ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన సమగ్ర సమాచార బుక్‌లెట్, వివిధ రకాల పుస్తకాలను ఫౌండేషన్ సెంటర్‌కు అందిస్తామన్నారు. ఈ సందర్బంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతిమ ఫౌండేషన్ కల్పిస్తున్న స్టడీ సెంటర్ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, విద్యార్థి జిల్లా కో-ఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఫిరోజ్ ఖాన్, దూలం సంపత్ గౌడ్, సాయికృష్ణ, ప్రభాకర్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్ కుమార్

ఘనంగా శ్రీపాదరావు వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కరీంనగర్:
కరీంనగర్‌లోని స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ స్పీకర్, స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు వర్ధంతి వేడుకలను నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..శ్రీపాద రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా అందరి మన్ననలు పొందడమే కాకుండా మారుమూల మంథని నియోజక వర్గంతో పాటు రాష్ట్రం నలుమూలల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. నిరాడంబరతకు, నిజాయితీకి నిలువుటద్దమని అన్నారు. వారి ఆశయాలను శ్రీధర్ బాబు కొనసాగిస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలుగా వారి అడుగుజాడలలో నడుస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, ఎండీ తాజ్, శ్రావణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, కుర్రపోచయ్య, సయ్యద్ అఖిల్, షబానా మహమ్మద్, మామిడి సత్యనారాయణ రెడ్డి, కమురుద్దీన్, బొబ్బిలి విక్టర్, నిహాల్ అహ్మద్, వంగల విద్యాసాగర్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.7900

నవతెలంగాణ-జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు కాటన్ విడి పత్తి 15 74 క్వింటాళ్లు 103 వాహనాలలో రైతులు గురువారం విక్రయానికి తీసుకు రాగా గరిష్ట ధర రూ.7900, మాడల్ ధర రూ.7800, కనిష్ట ధర రూ.7400 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 20 క్వింటాళ్లు 13 మంది రైతులు విక్రయానికి తీసుకు రాగా గరిష్ట ధర రూ.7500, మోడల్ ధర రూ.7000, కనిష్ట ధర రూ.6,500 పలికిందని మార్కెట్ సెక్రటరీ గుగులోతు రెడ్డి తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మార్కెట్‌కు సెలవు కాగా శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉన్నాయి. తిరిగి ఈనెల 17 సోమవారం మార్కెట్ పున:ప్రారంభమవుతుందని, రైతులు సహకరించాలని మార్కెట్ సెక్రటరీ కోరారు.

నాలుగేళ్లు పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ- చొప్పదండి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం చొప్పదండి మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సంబరాలు చేసుకున్నారు. విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... భవిష్యత్తులో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీఓ రాజగోపాల్ రెడ్డి, సూపరింటెంట్ శ్రవణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ నరోత్తం రెడ్డి, పీఆర్ఏ ఈ విజయ సారధి, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, టైపిస్ట్ శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ నెలవేణి సుష్మ-మహేష్

నవతెలంగాణ- శంకరపట్నం: మండల పరిధిలోని మక్త గ్రామ సర్పంచి నెలవేణి సుష్మ-మహేష్ ఆధ్వర్యంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,.. కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నామని... ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ బషీరుద్దీన్, ఉప సర్పంచ్ గాజుల రజిత, క్యాంప్ మెడికల్ డాక్టర్ కీర్తన, గ్రామ కార్యదర్శి వంశీ, వార్డు సభ్యులు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచ్ సుష్మ

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



నవతెలంగాణ-తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో డిప్లమా చదువుతున్న పెద్దపెల్లికి చెందిన నీలపు బాలరాజు (19) స్థానికంగా ఉన్న ఎస్ఆర్ బాయ్స్ హాస్టల్ లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నాడు. గురువారం తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు రామకృష్ణ కాలనీ శివారులోని లోయర్ మానేరు డ్యామ్‌లోకి వెళ్లి ఈత కొట్టేందుకు వాగులో దిగాడు. ఈత రాకపో వడంతో నీటిలో మునిగిపోవడంతో గమనించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. బాలరాజు ఆచూకీ దొరకకపోవడంతో భయపడిన స్నేహితులు 100 నెంబర్ కు డయల్ చేశారు. ఎస్ఐ ప్రమోద్ రెడ్డి వెం టనే సంఘటన చేరుకొని అప్పటికే నీట మునిగి చనిపోయిన బాలరాజు మృతదేహాన్ని బయటికి తీయించారు. తండ్రి బలరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్ రెడ్డి చెప్పారు.

అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలి



నవతెలంగాణ - ఇల్లంతకుంట

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు అందరు కృషిచేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం అన్నారు. గురువారం రామోజీపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత పెద్దింటి అశోక్ కుమార్, అబ్రార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ - మంథని : రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు మంథని శాఖ గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని 'భారత దేశ పురోగమనంలో డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తి' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గుడిసె గట్టయ్యయాదవ్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ సుమతి, పాఠకులు, ఉపాధ్యాయులు లోకే రాజ్‌పవన్, బహుత్ కిషోర్, నన్నేగారి నరసింహారావు, ఐత రాజేష్‌కుమార్, తుండ్ల నవీన్, ప్రనయ్, రవీందర్, రాజశేఖర్ పాల్గొన్నారు. విద్యార్థుల విభాగంలో ప్రథమ బహుమతి లోకే వినమ్ర, ద్వితీయ బహుమతి నన్నేగారి హన్సిక, తృతీయ బహుమతి బహుత్ ఉన్నతి, పాఠకుల విభాగంలో జక్కుల ప్రసాద్, మాధవి బహుమతి పొందారు.



గంభీరావుపేట : తయారుచేసిన డాక్టర్ అంబేద్కర్ ప్రతిమను చూపిస్తున్న చేపూరి సంతోష్ చారి

కమలం గూటికి ఏలేటి..!

- కాంగ్రెస్‌కు రాజీనామా.. జేపీ నడ్డా, తరుణ్‌చుగ్‌తో భేటీ
- త్వరలో నిర్మల్‌లో బహిరంగ సభ..అధికారికంగా చేరిక
- ఉమ్మడి జిల్లాలో హస్తం పార్టీకి భారీ షాక్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మెన్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇటీవల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటీ ఏలేటీకీ వివరణ ఇవ్వాల్సిందిగా షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎందుకు నోటీసు ఇచ్చారో తెలుపాలని స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో కలత చెందిన ఆయన గురువారం హస్తం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు రాజీనామా కాపీని పంపించినట్లు తెలిసింది. ఈ వెంటనే దిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌ను కలిసి కాషాయ కండువా కప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన వెంట ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఈటెల రాజేందర్ తదితర ముఖ్య నాయకులు ఉన్నట్లు తెలిసింది.

షోకాజ్ నోటీసుతో అసంతృప్తి..!

కాంగ్రెస్ పార్టీకి కొన్ని రోజులుగా దూరంగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి రెండు రోజుల క్రితం నాయకులు, కార్యకర్తలతో నిర్మల్‌లో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మెజార్టీ కార్యకర్తలు, సన్నిహితులు బీజేపీలోకి వెళ్తే బాగుంటుందని సూచించినట్లు తెలిసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వివరణ ఇవ్వాలని పీసీసీ క్రమశిక్షణ కమిటీ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో ఆగ్రహం వ్యక్తం చేసిన మహేశ్వర్‌రెడ్డి షోకాజ్ నోటీసు ఎందుకు జారీ చేశారో సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. గురువారం దిల్లీ వెళ్లిన ఆయన బీజేపీ అగ్రనేతలను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈనెల 26న నిర్మల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి బీజేపీ పెద్దల సమక్షంలో అధికారికంగా కాషాయ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు షాక్..!

రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం ఆ పార్టీకి పెద్ద షాక్ తగలింది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మెన్ పదవితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక నాయకుడిగా ఉన్న ఆయన హస్తం పార్టీకి దూరం కావడం ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేసింది. ఉమ్మడి జిల్లాలో మహేశ్వర్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు రెండు వర్గాలు ఉంటూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర కొనసాగిస్తుండగా ఒకటి రెండు సార్లు ఇందులో పాల్గొన్న మహేశ్వర్‌రెడ్డి మళ్లీ ఈ యాత్ర వైపు రాలేదు. కొన్ని రోజులు నుంచి పార్టీకి దూరంగా ఉన్న ఈయన నాయకులు, కార్యకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించడం.. బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం జరగడం.. ఆ వెంటనే కాంగ్రెస్ నుంచి ఆయనకు షోకాజ్ నోటీసు రావడం వంటి పరిణామాలు వేగంగా సాగిపోయాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరగణం కలిగిన ఏలేటీ కాంగ్రెస్‌కు దూరం కావడంతో ఆ పార్టీలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది.

చలో బోథ్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 14న బోథ్ నియోజకవర్గంలోని పొచ్చెర గ్రామంలో నిర్వహించి తలపెట్టిన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ రేగుంట కేశవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద చలో బోథ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న పొచ్చెర గ్రామంలో అంబేద్కర్ జగ్జీవన్‌రావ్ జ్యోతిరావు పూలే కొమురం భీం విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందన్నారు. విగ్రహాల ఆవిష్కరణకు మందకృష్ణ మాదిగ, తీగల ప్రదీప్‌గౌడ్, ప్రొఫెసర్ ఖాసిం, ఏపూరి సోమన్నగౌడ్, నర్సయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుండి ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండమూర్తి, గుడిసెల రాజేష్, జిల్లా నాయకుడు జాడే ఆత్మరాం, ఎంఎస్పీ నాయకులు కుమార్, షాకీర్, ప్రశాంత్ కిషోర్ పాల్గొన్నారు.

రేపు నిర్మల్‌కు కోదండరాం రాక

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'నిలెత్తు మనిషి'

నడి ఊళ్లె,
నాలుగు తొవ్వలకాడ,
నిలవడ్డ నిలెత్తు మనిషి,
ఐదడుగుల ఎత్తు,
ఎత్తుకు దగ్గ బరువు.
గంభీర మొకం.
ఊరూర గ్రామ దేవతైండు.
అతని పూజకై, పూలమాలలే
నడచి వెళ్ళి,
మెడల ఊగులాడి,
ఆలింగనం జేసుకొంటన్నయి.
ఎందుకో తెలుసా?
అతడు మతోన్మాదము
పెంచె దేవునికి మారుగా,
నిలిచిన రాతి బొమ్మ కాదని.
వెనకబడి
నవ్వుల పాలుగాకు,
ముందుకు సాగి,
అందుకో ఆకాశమని
సూపుడు వేలు
మౌన సందేశమిస్తన్నది.
మంత్రులకే
మంత్రోపదేశం జేసే,
'రాజ్యాంగం'
దేశ పరిపాలనా బండికి,
ధర్మ చక్రమై తిరుగుతున్నది.
అర ఫీటు పొడవున్న
బూటును జూస్తే,
రాళ్ళల్ల, ముండ్లల్ల ఉరికిన
పాదం కందకుండ ఉంటదని
మొండి ధైర్యం బోధపడుతున్నది.
పక్కనున్నది
ఐదు రంగుల జెండా
పంచశీల సూత్రయుగముల
శుద్ధ వాసన ప్రపంచమంత విస్తరించ
రెపరెప లాడుతున్నది.
కళ్ళద్దాల కెళ్ళి,
ఉదయించిన చూపు,
పీడిత జనాల ఆశాకిరణం
'ఉషస్సు' అయింది.
ఏసుకున్న కోటు
గుండీల బిగువు
అన్యాయం గుండె మీద
ఫిరంగి గుండైంది.
కులం కుంపటిని,
మతం మతలబును
మంట గలుపుడే
అతడు డాక్టరుగా
మనకిచ్చే మందు.



తాక్సాండె
చరణ్‌దాస్
యాపల్‌గూడ
9441017028

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

రైతులకు ఎలాంటి విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ చౌహన్ అన్నారు. గురువారం పాత ఎల్లాపూర్ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విధులు పట్ల అలసత్వం వహించకుండా దృష్టికి రైతులు తెచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గోడలపంపు గ్రామానికి విద్యుత్ సరఫరా లైను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మొదలు ఖానాపూర్ మునిసిపాలిటీలోని రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను తొలగించే కార్యక్రమం అయన ప్రారంభించారు. రోడ్డు కు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు వెంటనే పనులు ప్రారంభించనునట్లు తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మొదలుకొని ఐబి చౌరస్తా వరకు 26 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక ఏఈ తిరుపతి, వెంకటేష్ తో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.

పంట కోత ప్రయోగాలు



కౌటాల :మండలంలోని గుండాయిపేట్ గ్రామ శివారులో రైతులు వేసిన మొక్కజొన్న పంటలో వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. పంట కోత ప్రయోగాల వల్ల రైతులకు ఒక ఎకరానికి ఎంత దిగుబడి వస్తుందని అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ సాగు చేసుకుంటే లాభాల బాటలో వెళ్తారని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

నవతెలంగాణ-గుడిహత్నూర్



మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇచ్చోడ ఎఫ్ఆర్ఓ పాండురంగ్ తెలిపిన వివరాల ప్రకారం..కలపను అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు, గుడిహత్నూర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఇచ్చోడ వైపు నుండి ఆదిలాబాద్‌కు వెళ్తున్న మ్యాక్స్ పికప్ వాహనాన్ని(ఏపీ20టీబీ 8473) తనిఖీ చేయగా అందులో కలప సైజులు ఉండడంతో వాహనంతో పాటు కలపను స్వాధీనం చేసుకొని ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వాహనంలో 61 సైజులు ఉన్నాయి. వాటి విలువ రూ.1,84,000 ఉంటుంది. కలప సైజులు అక్రమంగా తరలిస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన గూడూరి శివ, కాదాసు రాజన్న, తాడేపల్లి విశ్వనాథ్‌పై కేసు నమోదు చేశారు. సంయుక్త ఆపరేషన్‌లో గుడిహత్నూర్ ఎస్ఐ ఎల్.ప్రవీణ్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కృష్ణనాయక్, పోలీసు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన సిబ్బంది

నవతెలంగాణ - సిర్పూర్(టి)



సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ప్రత్యేకంగా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన వాటిలో ఆరుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో డీసీఓ పోలోజు బాలరాజు విద్యార్థులను అభినందించారు. గురువారం సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీట్లు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్చి ఐదో తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సిర్పూర్ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డి ప్రవీణ్, రాజేష్, అఖిల్, అకీరనందన్, గౌలిదొడ్డిలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలో, షేక్‌పేట్‌లో విష్ణువర్ధన్, కరీంనగర్‌లో అభిరామ్ సీట్లు పొందారన్నారు. రాబోయే కాలంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు శ్రీధర్, ప్రవీన్, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని



నవతెలంగాణ- నిర్మల్

విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆశా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.తానూర్ మండలం పీహెచ్‌సీ పరిధిలో ఉజ్వల అనే ఆశా కార్యకర్త విధుల్లో ఉండగా ద్విచక్రవాహనంపై నుండి పడి మృతి చెందిందన్నారు. బాసరలో లావణ్య, సోన్‌లో శ్యామల అనే కార్యకర్తలు విధులు నిర్వహిస్తు చనిపోయారని వివరించారు. ప్రభుత్వ పరంగా వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా కార్యదర్శి గంగామణి, ఉపాధ్యక్షురాలు సుగుణ, నంద, సువర్ణ, లక్ష్మి, భార్గవి, స్వప్న, కమల, సునీత పాల్గొన్నారు.

మహేశ్వర్‌రెడ్డి వెనకనే మా అడుగులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వెంటనే అడుగులు వేస్తానని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు దొడ్డికింది ముత్యంరెడ్డి స్పష్టతనిచ్చారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం బీజేపీలో చేరిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. తాను కూడా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరతానని స్పష్టం చేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల, గ్రామాల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు అందరూ బీజేపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ పట్టణానికి చేరుకోగానే ఆయన సలహాలు, సూచనలు, ఆదేశాలకు కట్టుబడి ఉంటామని చెప్పారు.

అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలి

నవతెలంగాణ- కడెం

మండలంలోని అంబేద్కర్ సంఘ భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ సునారికారి రాజేష్ అధ్యక్షతన గురువారం సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతికి సంబంధించి కార్యాచరణ రూపొందించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ కన్నాపూర్ నుండి ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమై మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం విగ్రహం వద్ద సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ వాదులు, కులా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అలెగ్జాండర్, నిర్మల్ జిల్లా జడ్పీ కో అప్షన్ నెంబర్ ఎండీ రఫీక్, మాజీ సర్పంచ్ చిట్యాల చిన్నయ్య,ఎస్సీ,ఎస్టీ హక్కులపరిరక్షణ రాష్ట్ర కార్యదర్శి భూక్య కిషన్ నాయక్,అడ్వొకేట్ పసుల రాజలింగం,నేదూరి జాకుబ్, సర్పంచులు బొడ్డు గంగన్న, జాడి ఇందూర్, బాణావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు

● సంక్షేమ శాఖ ఈడీ సజీవన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ కలలు కన్న సమ సమాజ స్థాపన నేటికీ సాధ్యం కాకపోయినప్పటికీ ఆయన కలలు నిజం చేసే దిశగా ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ అన్నారు. అబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ గృహాలు 24,365 ఉండగా 2014 జనాభా ప్రకారం 86829 ఉన్నట్లు తెలిపారు. గడిచిన సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 77 మంది కాగజ్‌నగర్ నియోజకవర్గంలో వందమంది లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇదే కాకుండా ట్రాన్స్ పోర్ట్ వాహనాలు 110 మందికి అందజేసినట్లు తెలిపారు. మినీ డైరీ యూనిట్లు 11 మందికి, రవానేతర వాహనాలు 56 మందికి అందజేసినట్లు వివరించారు. ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యాభివృద్ధి జరిగితే ఎస్సీల అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఎస్సీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు గర్వకారణం

● అంబేద్కర్ సెంటర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాపు జాడే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారతదేశానికి దిశ నిర్దేశం చేసి రాజ్యాంగం రచించడంతోపాటు సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉండాలని తెలిపిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అటువంటి మహనీయుని పేరు తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయానికి పెట్టడం గర్వకారణమని అంబేద్కర్ సెంటర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బాపూ జాడే అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన నవతెలంగాణతో పాట్లాడారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం ఎంతో గర్వకారణం అన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించడానికి నాయకులు కృషి చేయాలని కోరారు. బుద్ధ విహార్ ఏర్పాటు చేయాలన్నారు. దీక్షల కోసం అవసరమైన దీక్ష భూమి మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో మాత్రమే ఉందని దీనితో అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ధర్మ చక్ర పరివర్తన రోజు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ.కోటి నిధులతో బుద్ధ విహార్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీని నిలబెట్టుకొని ఆకాంక్ష నెరవేర్చాలని కోరారు. దళితుల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు మూడు ఎకరాల భూమి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత బంధు పథకం దేశానికి ఆదర్శమని అర్హులైన వారికి అందజేయాలని కోరారు. లుంబిని దీక్ష భూమిలో అంబేద్కర్ భవనం పూర్తయితే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే దళితులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎస్సీల సంక్షేమం కోసం చేస్తున్న పథకాలు బాగున్నాయని కితాబునిచ్చారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

● మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ- నిర్మల్



విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సోఫినగర్ కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎంసెట్ క్రాష్ కోర్స్ కోచింగ్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫోన్ లో వాట్సప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాంలను బంద్ చేసి చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఫోన్‌లు ఎంత తక్కువ వాడితే అంత మంచిదని సూచించారు. తల్లిదండ్రులను సంతోష పెట్టేలా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. బాలిక విద్యకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే టెన్త్ తర్వాత ఇంటర్, డిగ్రీ కోర్సులకు సైతం రెసిడెన్సియల్ కాలేజీలను ఏర్పాటు చేసి, బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్ఎస్ సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, ప్రిన్సిపల్ గంగాశంకర్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో అభివృద్ధి సాధించాలి

తాంసి : రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కుర్మలకు రెండో విడతలో భాగంగా సబ్సిడీపై అందిస్తున్న గొర్రెల యూనిట్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమ కులస్తుల్లో రెండవ విడతలో లబ్ధిపొందుతున్న లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెలలో గొర్రెలను అందించడం జరుగుతుందన్నారు. తాంసి మండలంలో 122యూనిట్లు మంజూరు అయ్యాయని వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, పశు వైద్యాధికారి శ్రీకాంత్, యాదవ సంఘం సభ్యులు రాకేష్ యాదవ్, రామన్న, కిషన్, రాములు తదితరులున్నారు.


సదర్‌మాట్ చివరి ఆయకట్టు వరకు నీరందించాలి



నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

సదర్‌మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి తమ పంట సాగుకు తోడ్పడాలని కడెం మండల రైతులు సదర్ మాట్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం సదర్ మాట్ కాలువ లీకేజీలను కడెం మండల రైతులు పరిశీలించారు. నీటి వృధాను అరికట్టనట్లయితే తమ సాగుకు నీరు చేరడం సాధ్యం కాదన్నారు. కడెం మండలంలోని లింగాపూర్, ఎడగడప, మద్దిపడగా, పెద్దూరు, చిట్యాల, కొండకూరు గ్రామాల చివరి వరకు వరి పంట సదర్మాట్ నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జేఈ ఉదయ్ రైతులు పరిశీలిస్తున్న ప్రాంతానికి వచ్చారు. గతంలో ఇసుక సంచులు వేయడంతో అవి వరద నీటితో కొట్టుకుపోవడంతో లీకేజీ నీరు పెరిగిన మాట వాస్తవమేనని, రెండు రోజుల్లోగా పనులు ప్రారంభించి సకాలంలో సదర్ మాట్ కాలువకు నీరును పెంచుతామన్నారు. గండ్లను పూర్తిస్థాయిలో పూడ్చి రైతు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు ధర్మాజీ కిష్టయ్య, సెట్టిపల్లి స్వామి, గడ్డం మల్లారెడ్డి, మంచినీళ్ల భీమయ్య ఉన్నారు.

బోర్డు బిగిస్తే... రుసుము చెల్లించాల్సిందే..!



OFFICE OF THE MUNICIPAL COUNCIL :: KHANAPUR
DIST:NIRMAL

Roc.No.TP/MCA/Advt/2023, Dt:17.03.2023 (06.04)

NOTICE

(Issued Telangana Municipalities Act - 2019)

Sub:- Town Planning - Khanapur Municipality - Payment of Advertisement for the period from 06.04.2023 to 31.03.2024 - Notice Iss Regarding.

Ref: - 1. Circular No.143551/2020/K2, Dt:04-07-2020.
2. Telangana Municipalities Act, 2019.

నవతెలంగాణ- ఖానాపూర్ రూరల్

మేజర్ పంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఆవిర్భవించిన ఖానాపూర్ పట్టణంలో అభివృద్ధి పక్కన పెడితే అధిక పన్నులు వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం గతానికి భిన్నంగా వ్యాపార సముదాయాలకు బిగించిన బోర్డులకు సంబంధించి ట్యాక్స్‌లు చెల్లించాల్సిందిగా అడ్వర్టైజ్‌మెంట్ ట్యాక్స్ పేరుతో సదరు వ్యాపారులకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేస్తున్నారు. అదే క్రమంలో ఓ చిరు వ్యాపారికి నోటీసు జారీచేసి ట్యాక్స్ కట్టాల్సిందిగా సిబ్బంది చెప్పడంతో వ్యాపారికి సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో హోటల్ వ్యాపారికి మున్సిపాలిటీ సిబ్బంది ట్యాక్స్ చెల్లించాల్సిందిగా నోటీస్ ఇచ్చారు. తమ వ్యాపారం సరిగా సాగడం లేదు, డబ్బులు లేవు అనడంతో ఇరువరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వ్యాపారాలు సక్రమంగా సాగడం లేదు బోర్డులకు చెల్లింపులు ఎలా కడుతారని పలువురు వ్యాపారులు వాపోతున్నారు.మున్సిపాలిటీ సిబ్బందిపై స్థానికులు మండిపడుతున్నారు.

అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యం

నిర్మల్ : అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యం నినాదంతో జనవరి 18న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో గురువారం కంటి వెలుగు కేంద్రాన్ని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల ఇబ్బందులు గమనించి, కంటిబాధల నుంచి విముక్తి కోసం సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకం తీసుకువచ్చారని అన్నారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో 2 లక్షల మందికి కంటి పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్న 21,500 మందికి మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులను పంపిణీ చేశారని తెలిపారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, నాయకులు ఉన్నారు.




ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తుగా అంబేద్కర్ జయంతి


జయంతి నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నవతెలంగాణ - మంథని

మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, చరిత్ర, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ముందస్తుగా గురువారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎండి తాహెర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజకీయవేత్త, సామాజిక సంస్కర్త, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు అణగారిన వర్గాల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు నడుచుకొని భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి కో- ఆర్డినేటర్ డాక్టర్ భారత్, అకడమిక్ కో ఆర్డినేటర్ కృష్ణ, ప్రోగ్రాం అధికారి లక్ష్మీనారాయణ, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు అమర్నాథ్, చరిత్ర అధ్యాపకుడు సతీష్, ఇతర అధ్యాపకులు పర్శయ్య, ముకుందాం, సుదర్శన్, మానస, రజిత, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





అంబేద్కర్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతిపక్ష పార్టీలు,ప్రజాసంఘాల నాయకులు


నవతెలంగాణ - మంథని

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని గురువారం మంథని అంబేడ్కర్‌చౌక్‌లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం మంథనిలో ఘనంగా నిర్వహిస్తామని, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు,అన్ని వర్గాలకు చెందిన ప్రజలు భాగస్వాములు అయ్యి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇనుముల సతీష్, మంథని సత్యం, బూడిద గణేష్, క్రాంతి కుమార్, తోకల మల్లేష్, బూడిద శంకర్, చంద్రు, రాజమల్లు, బూడిద తిరుపతి, ఎరుకల రమేష్, ఎరుకల మధు, ఆర్ల సందీప్, మంథని శ్రీనివాస్, వేల్పుల రాజయ్య, విరుగురాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.









సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కౌటాల : మండల కేంద్రంలోని సదాశివపేటలో రూ.17లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో గ్రామాల్లోని ప్రతి గల్లీ సీసీ రోడ్డుగా మారుతున్నట్టు తెలిపారు. గతంలో వర్షాకాలం వచ్చిందంటే ఇంటి నుండి కాలు బయట పెట్టలేని దుస్థితి ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గల్లీ రోడ్లు కూడా సీసీ రోడ్లుగా మారినట్టు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లోని అన్ని రహదారులు సీసీ రోడ్డుగా మారాయని, మిగిలిన రోడ్లు కూడా త్వరలోనే సీసీ రోడ్లుగా మారుస్తామని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌గౌడ్, నయీం అహ్మద్, డబ్బ బాపు, ఆగయ్య ఉన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని జామా మజీదులో గురువారం ప్రభుత్వపరంగా రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. దీనికి జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. కిట్ల పంపిణీ అనంతరం కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్‌షరీఫ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు సిద్దిక్, ఎఐఎంఐఎం పట్టణ అధ్యక్షులు అబ్దుల్ ముబీన్, నాయకులు అబ్దుల్ సుభాన్, మజీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫొటో ఎగ్జిబిషన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. హిందీ, రాజనీతిశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌లో అంబేద్కర్ జీవితంలోని ముఖ్యఘట్టాల ఫోటోలను సేకరించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ రాజు, అధ్యాపకులు డి జనార్దన్, రాజేశ్వర్, దత్తాత్రేయ, టేమజీ, మహేష్, దేవేందర్, శారద, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - కౌటాల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వాన్ని దూరం చేసేందుకు మన ఊరికే కంటి వెలుగు శిబిరాన్ని తీసుకొచ్చిందని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండలంలోని గురుడుపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది కంటి సంబంధిత వ్యాధులు, కంటి చూపు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి అలాంటి వారి కోసం మన ఊరికే డాక్టర్లు వచ్చి కంటి పరీక్షలు చేసేలా కార్యక్రమం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని, సరిపోయే అద్దాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నికాడే అమ్మక్క, సర్పంచ్ మెర్పెల్లి సునంద, ఉప సర్పంచ్ సుజాత, వైద్యాధికారి రాజ్‌కుమార్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సదాశివ్, కార్యదర్శి సాయికృష్ణ, మాజీ ఎంపీపీ గంగారాం, నాయకులు ఆగయ్య, నిరంజన్, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి



కుభీర్ : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సంతోషి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్న సంతోషి కొంతకాలంగా పచ్చకామెర్లతో బాధపడుతోంది. పలు చోట్ల చికిత్స పొందినప్పటికీ నయం కాలేదు. అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్నలను పొందిన ఆమె మృతితో పలువురు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు

దిలావర్‌పూర్ : నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు సందర్భాల్లో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన ఘటనలో కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన జాదవ్ బలిరాంకు మూడు రోజుల జైలు శిక్ష, మరో ఏడుగురికి మొత్తంగా రూ.7400 జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్ఐ పాకాల గీత తెలిపారు. వాహన చోదకులు మద్యం తాగి వాహనాన్ని నడపడం నేరమని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్ : పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎల్లాగౌడ్‌తోటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ శిబిరానికి రక్తదాతలు హాజరై రక్తదానం చేయాలని వారు సూచించారు.

9వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక

కాగజ్‌నగర్: 2023-24 విద్యాసంవత్సరంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న ఐదు సీట్ల భర్తీకి ఫిబ్రవరి 11న నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి తెలిపారు. ఓపెన్ ఓబీసీ కోటాలో చోలే పార్థు (271024), ఓపెన్ ఎస్సీ కోటాలో కున్సోత్ వినయ్ (271397), రూరల్ అన్‌రిజర్వ్‌డ్‌లో నోముల అస్మిత (271513), బాలికల ఓబీసీ కోటాలో కరిపె ప్రీతి (271310), వికలాంగుల కోటాలో కల్యాణి అభిషేక్ (271281)లు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 17న తమ ధృవపత్రాలతో విద్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

అంధకారమేనా..?

- 17 నుండి సమ్మెకు సిద్ధమవుతున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు
- లేబర్ కమిషనర్ వద్ద విఫలమైన చర్చలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలో విద్యుత్ వినియోగదారులు

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. పీఆర్‌సీ కోసం విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు గత ఏడాది కాలంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేపడుతున్నా యాజమాన్యాల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో చివరి దశగా సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెల్సిందే. పీఆర్‌సీ ప్రకటించకపోవడంతో ఈ నెల 17 నుండి సమ్మె చేపడుతామని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ స్పష్టం చేయడంతో చివరి దశలో యాజమాన్యం లేబర్ కమిషనర్‌ను రంగంలోకి దింపి చర్చలు చేసినా అవి సఫలం కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అంధకారం తప్పదా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.



హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరుపుతున్న పవర్ జాక్ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ ప్రతీ నాలుగేళ్లకోసారి యాజమాన్యం చేపడుతుంది. ప్రస్తుతం వేతన సవరణ గడువు మార్చి 31, 2022తో ముగిసింది. వెంటనే వేతన సవరణ చేపట్టాల్సిన యాజమాన్యాలు (ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం) జాప్యం చేశాయి. దీనితో విద్యుత్ ఉద్యోగులు, యాజమాన్యాల మధ్య వైరం ప్రారంభమైంది. వేతన సవరణ కోసం 24 విద్యుత్ ఉద్యోగ సంఘాలతో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీని (పవర్ జాక్) నెలకొల్పారు. రెండు సంఘాలు మాత్రం ఈ జేఏసీలో లేవు. పవర్ జాక్ ఆధ్వర్యంలో తమకు 45 శాతం వేతన సవరణ చేపట్టాల్సిందేనని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు స్పష్టం చేస్తున్నారు. దీని కోసం పలు దశలుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21, 22 తేదీలలో సర్కిల్ లెవల్‌లో సమావేశాల నిర్వహణ, 24, 25, 27, 28 తేదీలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, మార్చి 1, 2 తేదీలలో భోజన విరామ సమయాలలో డివిజన్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు, 3, 4 తేదీలలో భోజన విరామ సమయంలో సర్కిల్, కార్పోరేట్, జనరేటింగ్ కార్యాలయాల ముందు నిరసనలు, 8 నుండి 23 వరకు సర్కిల్, కార్పోరేట్, జనరేటింగ్ కార్యాలయాల ముందు రిలే దీక్షలు, 24న హైద్రాబాద్‌లోని విద్యుత్ సౌధ ముందు మహా ధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు హాజరయ్యారు.

చర్చలు విఫలం

కాగా పవర్ జాక్ ఆందోళనల ఫలితంగా దిగి వచ్చిన యాజమాన్యాలు ఇప్పటి వరకు పలు దఫాలుగా చర్చలు జరిపాయి. మార్చి 29న ట్రాన్స్‌కో సీఎండి ప్రభాకర్‌రావు జేఏసీ నాయకులతో చర్చలు జరిపారు. ఈ చర్చలలో వేతన సవరణ ఐదు శాతం నుండి ప్రారంభించి ఆరు శాతం వరకు మాత్రమే ప్రకటించేందుకు వారు అంగీకరించారు. కాని జేఏసీ నాయకులు 45 శాతం పీఆర్‌సీ ప్రకటిస్తేనే తాము ఆందోళనలు విరమించుకుంటామని స్పష్టం చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. అనంతరం జేఏసీ నాయకులు ఏప్రిల్ 16లోపు పీఆర్‌సీ మీద ప్రకటన చేయని పక్షంలో ఏప్రిల్ 17 నుండి సమ్మె చేపడుతామని ప్రకటించారు. తిరిగి ఈ నెల తొమ్మిదిన విద్యుత్ శాఖా మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, సీఎండీ ప్రభాకర్‌రావు మరోసారి చర్చలు జరిపినా సఫలం కాలేదు. గురువారం మరోసారి కార్మిక శాఖ కమిషనర్ వద్ద జేఏసీ నాయకులు చర్చలు జరిపారు. ఈ చర్చలలో 7 శాతం పీఆర్‌సీ ఇస్తామని కమిషనర్ తెలిపినా జేఏసీ నాయకులు అంగీకరించలేదు. జేఏసీ నాయకుల డిమాండ్‌కు, యజమాన్యాలు చెల్లిస్తామని చెప్పేదానికి ఎలాంటి పొంతన లేకపోవడంతో సమ్మె అనివార్యమనే సంకేతాలు వస్తున్నాయి. 2014లో 30 శాతం, 2018లో 35 శాతం పీఆర్‌సీ చెల్లించారని, ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇపుడు తాము 45 శాతం పిఆర్‌సీ చెల్లించాలని డిమాండ్ చేస్తే యాజమాన్యాలు కేవలం 7 శాతం చెల్లిస్తామని చెప్పడం పట్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇదీ పరిస్థితి

కాగా సమ్మె అనివార్యమైతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అంధకారం నెలకొంటుంది. కొత్త జిల్లాల వారీగా చూస్తే నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలలో రెండేసి చొప్పున ఎనిమిది విద్యుత్ డివిజన్‌లు ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో నిర్మల్, భైంసా, ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూరు, మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో డివిజన్‌లు ఉన్నాయి. ప్రతీ జిల్లాకు ఒక సూపరెంటెండింగ్ ఇంజనీర్‌తో పాటు ఒక ఎంఆర్‌టీ డీఈ, ప్రతీ డివిజన్‌కు ఒక డీఈ, ఏడీఈలు ఉన్నారు. వీరితో పాటు ఎంఆర్‌టీ ఏడీఈలు, కమర్షియల్ ఏడీఈలు కూడా ఉన్నారు. ఈ సమ్మెలో ఎస్‌ఈతో పాటు డీఈ, ఏడీఈలు కూడా పాల్గొననున్నారు. కింది స్థాయిలో ఏఈలు, సబ్ ఇంజనీర్లు, అకౌంట్స్ సిబ్బంది. కార్మికులు, ఆర్టిజన్లు, అన్ మ్యాన్‌డ్ వర్కర్లు కూడా సమ్మెలో పాల్గొంటారు. పై స్థాయి నుండి కింది స్థాయి వరకు సమ్మె చేపడుతుండడంతో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోననే ఆందోళన విద్యుత్ వినియోగదారులలో నెలకొంటోంది.

యాజమాన్యంగా మొండిగా వ్యవహరిస్తోంది : ఎమ్మాజి సతీష్, పవర్ జాక్ జిల్లా కో కన్వీనర్, కుంరంభీం ఆసిఫాబాద్



యాజమాన్యం విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల మొండిగా వ్యవహరిస్తోంది. ప్రతీ నాలుగేళ్లకోసారి జరిగే వేతన సవరణ పట్ల యాజమాన్యం ఇంత మొండిగా వ్యవహరించడం సరికాదు. విద్యుత్ ఉద్యోగుల కృషితో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 138 శాతం పెరుగగా, ట్రాన్స్‌మిషన్ లైన్ సామర్థ్యం 70 శాతం పెరిగింది. ఇహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లు, 33 కేవీ సబ్‌స్టేషన్‌లు పెరిగాయి. కాని ఉద్యోగులకు, కార్మికులకు ఇచ్చే పీఆర్‌సీని పెంచాల్సింది పోయి తగ్గిస్తామని చెప్పడం సరికాదు. ఈ నెల 17 నుండి సమ్మె చేపట్టడం అనివార్యం.



ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం జరుగుతోంది : జె శంకర్, ఆర్టిజన్ కార్మికుడు

2018 వేతన సవరణలో ఆర్టిజన్ కార్మికులకు అన్యాయం జరిగింది. పర్సనల్ పే నుండి బేసిక్ పే లో కలిపి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టిజన్ కార్మికులకు విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలి. 2018 వేతన సవరణలో జరిగిన అన్యాయాన్ని ఇపుడు సవరించాలి.

నేడు నస్పూర్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ



- జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే రాక
- హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా నాయకులు
- లక్ష మందితో జన సమీకరణ

నవతెలంగాణ - మంచిర్యాల

కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్తేజం కనిపిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ నాయకత్వం చేపడుతున్న పాదయాత్రలు పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. ఒకవైపు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మరోవైపు పార్టీ శాసనసభ పక్ష నేత భట్టి విక్రమార్క చేపట్టిన యాత్రలకు అన్ని వర్గాల నుండి ఆదరణ లభిస్తోంది. జిల్లాలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సాగుతున్న పాదయాత్ర సందర్భంగా శుక్రవారం సింగరేణి ఏరియా నస్పూర్ లో తలపెట్టిన భారీ బహిరంగ సభకు జిల్లా నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సభకు జాతీయ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే తో పాటు ఏఐసిసి ముఖ్య నాయకులు, రాష్ట్ర పార్టీ అగ్ర నాయకులు హాజరు కానున్నారు. సుమారు లక్ష మంది జన సమీకరణతో బహిరంగ సభను జయప్రదం చేసే దిశగా టిపిసిసితోపాటు జిల్లా పార్టీ నాయకత్వం సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామకరణతో వేదికను సిద్ధం చేసిన స్థానిక నాయకులు జిల్లా కేంద్రంతో పాటు సభ పరిసర ప్రాంగణాలను పార్టీ జెండాలతో అలంకరించారు.

సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన ముఖ్య నాయకులు

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా నాయకులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర పార్టీ ఇంచార్జ్ మానిక్‌రావ్ ఠాక్రేతో పాటు ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎఐసిసి నాయకుడు రోహిత్ చౌదరితో పాటు మరికొందరు ముఖ్య నాయకులు సభా స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లను చూస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ వేదిక ద్వారా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వానికి సవాల్ చేసేందుకు పార్టీ నాయకత్వం ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తరుణంలో చేపడుతున్న మొదటి బహిరంగ సభకు జాతీయ పార్టీ అగ్రనేతలు వస్తుండడంతో ఈ సభ ద్వారా రాష్ట్రంలో మరింత ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లే దిశగా రాష్ట్ర జిల్లా నాయకత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పార్టీలో ఐక్యత కనిపించేనా...?

జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొదటిసారిగా రాష్ట్రానికి వస్తుండడం వల్ల రాష్ట్ర పార్టీ నాయకుల్లో ఉన్న విభేదాలు తొలగిపోవాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. బహిరంగంగానే నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు ఆరోపణలు చేసుకోవడం వల్ల ప్రజల్లో పార్టీ పట్ల చులకన భావన కల్గుతుందని పేర్కొంటూ జాతీయ పార్టీ నాయకత్వం నాయకుల గొడవలను సద్దుమణిగించే విషయంలో దృష్టి సారించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. జిల్లా పార్టీలో కూడా పార్టీ నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉండడం గమనార్హం. జాతీయ పార్టీ అధ్యక్షులు రాకకు ఒక రోజు ముందే నిర్మల్‌కు చెందిన పార్టీ ముఖ్య నాయకుడు మహేశ్వర్‌రెడ్డి పార్టీని వీడి బిజెపిలో చేరడం ఉమ్మడి జిల్లా పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకుల విభేదాలను ఏ విధంగా సద్దుమణిగించే ప్రయత్నం చేస్తుందోనని పార్టీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి.

మాతాశిశు మరణాలు తగ్గించడమే ప్రభుత్వ ధ్యేయం



బెజ్జూర్: మాతాశిశు మరణాలు తగ్గించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఇందులో భాగంగానే ఎంసీహెచ్‌పీ అనే కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి సరైన పౌష్టికాహారం తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అప్‌గ్రేడ్ కావడంతో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా ఐటీడీఏ ద్వారా అదనంగా ఇద్దరు డాక్టర్‌లను నియమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అవ్వాల్ అంబులెన్స్‌లు పూర్తిస్థాయిలో కొనసాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో కంటి వెలుగు పథకం విజయవంతంగా కొనసాగుతుందని, కంటి చూపుతో బాధపడుతున్న వారు శిబిరాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. ఆస్పత్రిలో గ్రూపు విభేదాలు లేకుండా సమన్వయంతో పనిచేసే రోగులకు వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సీతారాం నాయక్, వైద్యులు సుకన్య, అవినాష్, సూపర్‌వైజర్ రేణుక, హెచ్ఈఓ కోటేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ లక్ష్యం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా టీఎస్‌యూటీఎఫ్ పని చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లో సంఘం పదో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పతాకాన్ని శాంతికుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం కృషి చేసిన ఏకైక సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన ఫలితంగానే ఈ రోజు పోరాట అగ్రగామి సంఘంగా పేరు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకులాల కన్వీనర్ నరేష్, మండల బాధ్యులు సోనీలాల్, నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ : టీఎస్‌యుటిఎఫ్ పదవ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు సంఘం ఆధ్వర్యంలో చేస్తున్నామన్నారు. దీంతో ఇతర సంఘాల నుండి టీఎస్‌యూటీఎఫ్‌లో భారీ సంఖ్యలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బక్కన్న, లక్ష్మణ్, రమేష్, చంద్రశేఖర్, గణపతి, బలిరాం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ పాల్గొన్నారు.

17న వీఓఏల సమ్మె విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 17న ఐకెపీ వివోఏల సమ్మె విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 17 నుండి రాష్ట్రవ్యాప్తంగా జరిగే సమ్మెలో జిల్లాలోని వివోఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, వివోఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, సునీత, మండల అధ్యక్షులు బుద్దు, మండల కార్యదర్శి రమ, సంతోష్, రవీందర్, దత్తు, శ్రీనివాస్, రోజ, జేవంత్, ధనరాజ్ చారి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యవంతులను చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్లాస్టిక్ నిషేధం పట్ల గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యవంతులు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. గురువారం ఎస్పీఎం స్పర్శ ఫౌండేషన్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్థానిక ట్రైనింగ్ సెంటర్‌లో 11 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చాహత్ బాజ్‌పేయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం కాలుష్యమవుతోందని అన్నారు. గ్రామాలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం నివారణలో ప్రతీ గ్రామం ఆదర్శ గ్రామంగా నిలిచేలా చూడాలని అన్నారు. అనంతరం పర్యావరణానికి సంబంధించి పాంప్లెట్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గౌరీశంకర్, ఎస్పీఎం ఫనికుమార్, ఏపీఎం ముక్తేశ్వర్, ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, చీఫ్ మేనేజర్ రమేష్‌రావు, ప్రతినిధి తుమ్మ రమేష్, సీఈఈ ప్రాజెక్టు అధికారి విద్యాభూషణ్, వినల్, సుధీర్, అశోక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు

నవతెలంగాణ-సిరికొండ

విద్యుత్ సమస్యలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సిజీఆర్ఎఫ్ ఛైర్మెన్ ఈశ్వరయ్య అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, మిటర్లకు ఎక్కువ బిల్లులు వస్తున్నాయని, విద్యుత్ వైర్లు ఇళ్లపైన ఉన్నాయని తొలగించాలని తదితర సమస్యలపై దాదాపుగా 31వరకు దరఖాస్తులను అందజేశారు. అనంతరం అధికారులు మాట్లాడారు. వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దని, బిల్లులను ఎప్పటికప్పుడు కట్టుకుంటూ అధికారులకు సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు సబ్సిడీ ఉంటుందని, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను సంబంధిత అధికారులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిజెఆర్ఎఫ్ ఉన్నతాధికారులు అశోక్, కిషన్, భూమారెడ్డి, ఎస్ఈ సంపత్ కుమార్, డిఈలు సుభాష్, ఈదన్న, ఎస్ఏఓ దిగంబర్, ఏడిఈ చంద్రశేఖర్, ఏఈలు రోహిదాస్, శ్రావణ్, శ్రీనివాస్, గౌతమ్, మండల లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సర్పంచ్ నర్మద పెంటన్న, లైన్‌మెన్ లింగన్న, మహేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంబురాలు

నవతెలంగాణ-సిరికొండ



జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేష్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఏపిఓ శేషరావ్, అరుణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
10
శుక్రవారం 14 ఏప్రిల్ 2023

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

స్వయం ఉపాధికై నిర్వహించే జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని వైటీసీ జేడీఎం నాగభూషనం అన్నారు. గురువారం స్థానిక కేబీ కాంప్లెక్స్ పీఎమ్మార్పీఎస్ భవన్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైటీసీ జేడీఎం నాగభూషనం పాల్గొన్నారు. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ ప్రయివేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 183 మంది నిరుద్యోగులు హజరుకాగ 98 మంది ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం జేడీఎం మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని కుటుంబానికి బాసటగా నిలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో, దేశంలో అస్పృశ్యత నివారణలో అంబేద్కర్ సేవలను కొనియాడారు. నేటి యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన బాతూరి గంగారాం కండక్టర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. గురువారం మాజీ ఎంపీ గోడం నగేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, తాంసి జెడ్పీటీసీ రాజు, కేదారీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రంజిత్‌రెడ్డి, బోండ్ల వెంకటస్వామి, ఎల్‌టి శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్, మల్లయ్య ఉన్నారు.

ప్రారంభమైన పదో తరగతి మూల్యాంకనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జోసెఫ్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమైంది. జిల్లాకు 1.64లక్షల జవాబు పత్రాలు వస్తున్నాయని, ఇందుకోసం 677 మంది టీచర్లను నియమించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత తెలిపారు. కేంద్రంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగా గురువారం మూల్యాంకనం తీరును డీఈఓ పరిశీలించారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జీఓ ఎంఎస్ 33ను అధిగమించి ప్రశ్న పత్రాలు తయారు చేసి పరీక్ష నిర్వహిస్తున్న బోథ్‌లోని ఓ ప్రయివేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్ష నిర్వహిస్తున్న పరీక్షల్లో జిల్లాస్థాయిలో తయారైన ప్రశ్న పత్రాలను వినియోగించాల్సిందిగా ఉండగా సొంతంగా తయారు చేసిన ప్రశ్న పత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వేరేచోట ప్రశ్న పత్రాలు తయారు చేయించి, విద్యార్థులకు అందించిన ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

బాధిత పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విధుల్లో మరణించిన పోలీసు బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ, పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత సంవత్సరం డిసెంబర్ నెలలో తాంసి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ ఏవి రమణారెడ్డి భార్య విజయలక్ష్మికి భద్రతకు సంబంధించిన ఎనిమిది లక్షల విలువైన చెక్కులను జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్పీ గురువారం అందజేశారు. రూ.8 లక్షలలో ఆరు లక్షల విలువైన చెక్కు భార్య ఏ విజయలక్ష్మి పేరుపై, రెండు లక్షలు రమణారెడ్డి కూతురు ఏ.లీనారెడ్డి పేరుపై రావడం జరిగిందని ఇరువురికి భద్రత ద్వారా సహాయం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేష్ మిగిలిన ప్రయోజనాలను త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలకైనా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, అసోసియేషన్ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఏఓ యూనుస్ అలీ, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి కవిత పాల్గొన్నారు.

రాయితీ బస్‌పాస్‌ల అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని రాచపూర్ గ్రామంలో గురువారం ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో బస్‌పాస్ మేళ నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులకు బస్ ఛార్జీలో 50శాతం రాయితీతో కూడిన బస్‌పాసులు డిపో మేనేజర్ సాయన్న పంపిణీ చేశారు. ఈ బస్ పాసులు పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్ బస్‌లలో బస్ చార్జీలో సగం ధరకే టికెట్ పొందవచ్చని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది లక్క నర్సయ్య, టి.వి.రమణ, గ్రామ సర్పంచ్ శాతం బొర్రవ్వ గంగారాం, దివ్యాంగులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఉట్నూర్

నిర్మల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎమ్మెల్యేగా గెలిచిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీని విడటం సరికాదని అన్నారు. పార్టీని విడటాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అయనకి ఎలాంటి ద్రోహం చేయలేదని అన్నారు. పార్టీ గుర్తించి అయనకు ప్రాధాన్యతనిస్తూ పార్టీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మెన్ ఇచ్చినప్పటికీ ఏ ఒక్క కార్యక్రమాన్ని ఇప్పటివరకు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ పదవులు పొంది ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వాఖ్యానించడం విడ్డురంగా ఉందన్నారు. ఇలాంటి వ్యక్తులకి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. మహేశ్వర్‌రెడ్డి ఏ పార్టీలో వెళ్లిన డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండలంలోని మేకలగండి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేందర్ (32)అనే వ్యక్తి మృతి చెందాడు. ఎఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం... అదిలాబాద్ మండలంలోని చాంద(టి) గ్రామానికి చెందిన మహేందర్ గుడిహత్నూర్ వైపు నుంచి అదిలాబాద్‌కు వెళుతుండగా వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకోట్టడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు తాపీ మేస్త్రీగా పనిచేసేవాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై తెలిపారు.

అంబుజా సిమెంట్ నాణ్యాత ప్రమాణాలపై డీలర్లతో సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంబుజా సిమెంట్ నాణ్యాత ప్రమాణాలపై గురవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంబుజా సిమెంట్ ఇంజనీర్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబుజా సిమెంట్ టెక్నీకల్ టీమ్ తమ సిమెంట్ నాణ్యత, సర్వీసెస్, వివరించారు. అంతే కాకుండా కాకుండా నేటి భవన నిర్మాణ కాంక్రీట్ కట్టడాల గురించి క్లుప్తంగా వివరించారు. సమావేశంలో అంబుజా సిమెంట్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నీకల్ హెడ్ చంబెటి ఏడుకొండలు, టెక్నీకల్ ఆఫీసర్స్ హరికిరణ్, వంశీ కృష్ణ, ఆనంద్, సేల్స్ ఆఫీసర్ ఆదిత్య, అంబుజా డీలర్లు పాల్గొన్నారు.

బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- సామాజిక న్యాయం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర



నవతెలంగాణ-నిర్మల్

డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సామాజిక న్యాయం, భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కుల వివక్షత, అంటరానితనం నిర్మూలన, ప్రభుత్వ రంగాల పరిరక్షణ కనీస వేతనాలు అమలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ, రిజర్వేషన్ల సాధన కోసం ఈ పాదయాత్ర నిర్వహించడం జరిగిందని అన్నారు. చట్టాలు పాలకుల వరకే పరిమితం కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడాలని అన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే విధంగా చేసిందన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని భారత రాజ్యాంగానికి దూరం చేసి, ఆర్ఎస్ఎస్ భావజాలంలోనికి తీసుకు వెళ్లడానికి అనేకచోట్ల నియంతృత్వ ధోరణిలో వ్యవహరించడం జరుగుతుందని అన్నారు. భారత రాజకీయాలకు కులంగాని, మతంగాని దూరంగా ఉంచి ప్రజలందరికీ సామాజిక న్యాయం చేకూర్చినప్పుడే నిజమైన స్వాతంత్రం వస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక హక్కుల సాధన కోసమే కాకుండా సామాజిక అణిచివేతలపై, కుల వివక్ష నిర్మూలన కోసం, అంటరానితనం నిర్మూలన కోసం, సమానత్వం కోసం సీఐటీయూ పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి. గంగామణి, జిల్లా కమిటీ సభ్యులు చంద్రకళ, సువర్ణ, లక్ష్మి, స్వప్న, సుగుణ పాల్గొన్నారు.

విజయ డెయిరీ పాలకేంద్రం సందర్శన

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్నీ, తురాటి గ్రామాల విజయ పాల కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ పాడిరైతులందరూ కలిసి కేవలం విజయ డెయిరీకి పాలు పోయాలని నిర్ణయించడం హర్షనీయమని అన్నారు. టెంబుర్నీ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని, ప్రతిపల్లె పాడిని పెంపొందించాలని పేర్కొన్నారు. టెంబుర్నీ పాల సేకరణ కేంద్రాన్ని సందర్శించి, పాడి రైతులతో మాట్లాడి గ్రామంలోని పాల ఉత్పత్తిపై ఆరా తీశారు. పాడి రైతుల కోసం షెడ్ల నిర్మాణం, బహు వార్షిక పశుగ్రాస పెంపకం, అజోల్లా ఉత్పత్తి, సైలెజీ గడ్డి తయారీ లాంటి కార్యక్రమాలు ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని డీఆర్డీఓకు సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్‌ను విజయ డెయిరీ ద్వారా ముద్ర రుణాలు పీఎంఈజీపీ లోన్స్‌పై అవగాహన కల్పించాలని, స్త్రీ నిధి మేనేజర్ కపిల్‌ను సిబిల్‌తో సంబంధం లేకుండా పాడి పశువులకు రుణాలు స్త్రీనిధి కింద ఇవ్వాలని అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని గ్రామంలోని పాడి పశువుల పాల ఉత్పాదకత పెంపుదల కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 10 శాతం వెన్న గల పాలకు 80 రూపాయలు లీటర్ చొప్పున చెల్లించడం విజయ డెయిరీ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. ప్రభుత్వ డెయిరీని ఆదరించడం వలననే ప్రభుత్వ పథకాలు సాధ్యపడతాయని తెలిపారు. జిల్లాలోని 35 ఎన్నుకున్న గ్రామాల్లో పాల సేకరణ పెంచడానికి పాడి పశువుల కొనుగోలుకు సహకరిస్తామని వెల్లడించారు. తెలంగాణలో ఉదయమే గ్రామస్థాయి పాల సేకరణ పరిశీలించిన మొదటి జిల్లా కలెక్టర్‌గా నిలిచిపోతారని జిల్లా డెయిరీ డీడీ మధుసూదన్ పేర్కొంటూ పాలమిత్ర యాప్ ద్వారా పాల సేకరణ పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బ్యాంకు ద్వారా పాల పేమెంట్ జరుగుతుందన్నారు. గ్రామస్తుల ఐక్యత చూసి గ్రామానికి పోతు కొనుగోలుకు సహకరించామని



గుర్తు చేశారు. విజయ పెళ్లి కానుకగా రూ.5వేల చెక్ రైతుకు, 35 మంది పాడి రైతులకు పాలక్యాన్‌లను, పదిమంది రైతులకు లవణ మిశ్రమాన్ని అందజేశారు. తదుపరి మండలంలోని మరో గ్రామం తురాటీని సందర్శించి గ్రామంలో పాల సేకరణ పెంచడానికి రుణాలు అందజేస్తామన్నారు. ప్రతి గ్రామంలో పాల సేకరణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి వెన్న శాతం ధర వివరాలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, పశుసంవర్ధక అధికారి డాక్టర్ శంకర్, స్త్రీ నిధి మేనేజర్ కపిల్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ గోవర్ధన్, అదనపు డీఆర్డీఓ గోవింద్, డీపీఎం సాయిప్రసాద్, విజయలక్ష్మి, ఎంపీడీఓ తహసీల్దార్ శ్రీకాంత్, శ్రీనిధి అధికారులు పాడి రైతులు సర్పంచ్ దత్తు, మేనేజర్ దస్రు, బీఎంసీ ఇన్‌చార్జులు సాయన్న, గజ్జరాం సూపర్‌వైజర్లు రమేష్, సంతోష్, కాంతారావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

యాసంగి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలను చేపట్టాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం యాసంగి ధాన్యం కొనుగోలు 2022-23 సన్నద్ధతపై కలెక్టర్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. యాసంగిలో 98 వేల ఎకరాలలో వరి సాగు చేయడం జరిగిందని అన్నారు. మొత్తం కొనుగోలు అంచనా 17 లక్షల క్వింటాళ్లని, ఎ గ్రేడ్ రూ.2,060 సాధారణ రకానికి రూ.2,040 ధరను నిర్దేశించడం జరిగిందని అన్నారు. జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ రెండో వారం నుండి వరి కోతలు ప్రారంభమవుతాయని అన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 42.50 లక్షల గన్ని బ్యాగులు అవసరమవు తాయని అన్నారు. ప్రస్తుతం 28.32 లక్షల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. టార్పాలిన్లు, వేయింగ్ మిషన్‌లు, గన్ని బ్యాగులు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని అన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మెన్ లింగయ్య, రైతుసమితి అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-తాంసి

రైతులు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని సహకార బ్యాంకు ద్వారా రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ రాయితీలు పొందాలని ఏడీసీసీ బ్యాంకు అధికారి వివేక్ అన్నారు. గురువారం మండలం కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో నాబార్డు వారి సౌజన్యంతో కళాజాత ప్రదర్శన ద్వారా ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో భాగంగా అయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు, ఇన్సూరెన్స్ పథకాలు, సహకార సిరి డిపాజిట్ పథకంపై అత్యధిక వడ్డీ రేట్లు, ఆన్‌లైన్ మోసాలపై, సైబర్ నేరాల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆట, పాటలతో ఇంద్రజాల ప్రదర్శన ద్వారా కళాకారులు ఖాతా దారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అక్షరాస్యత కలిగి ఉండాలి ఎవరైనా బ్యాంక్ అదికారులమని అదర్ వివరాలు బ్యాంక్ ఖాత వివరాలు అడుగుతే చెప్పవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కేశవ్ సొసైటీ సిబ్బంది సిద్దార్థ్ రెడ్డి,



సుధాకర్, కళాజాత బృందం సభ్యులు రమేష్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం మూగజీవాలకు శాపం..!

నవతెలంగాణ-గుడిహత్నూర్

గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ల నిర్వహణపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో అవి మూగ జీవాల పాలిట శాపంగా మారుతున్నాయి. మండలంలోని సీతాగొంది గ్రామపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ చట్టం కింద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో పరిసర గ్రామాల పశువులు డంపింగ్ యార్డ్‌లోకి చొరబడి గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలను తింటూ అనారోగ్యానికి గురవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ పాలకవర్గంతో పాటూ అధికారుల ఉదాసీనత కారణంగా పశువులు మృత్యువాత పడే ప్రమాదం నెలకొందని సీతాగొంది పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతాగొంది డంపింగ్ యార్డ్ ప్రాంతంలో గోవులు ఆహారం కోసం పంచాయతీ చెత్తను, ప్లాస్టిక్ తింటున్న వైనాన్ని పలువురు నవతెలంగాణ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా పోసిన ప్లాస్టిక్ సంచుల చెత్తలో ఆహారం వెతకడం కనిపించింది. పశువులు నిత్యం ప్లాస్టిక్ సంచులు తింటున్న ఘటనలు కండ్లముందు నిరంతరం కనపడుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపట్ల పాడి రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త సేకరణలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంలో సరైన ప్రమాణాలు పాటించడం లేదని, అవసరమైన మేర కార్మికులకు సరైన వస్తువులు సమకూర్చడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ రకమైన అపరిశుభ్రత వాతావరణం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందన్న స్పృహ అధికారుల్లో కొరవడటం విచారకరమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే పశువులకు ఎలాంటి హాని కలగకుండా డంపింగ్ యార్డ్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.



ఇన్‌చార్జీ డీపీఆర్వోగా విష్ణువర్ధన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీపీఆర్వోగా ఈ.విష్ణువర్ధన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల డీపీఆర్వోగా విధులు నిర్వహించిన భీమ్ కుమార్‌ను నారాయణపేట్ జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. డీపీఆర్వో కార్యాలయంలో మహిళ సిబ్బందిని వేధించిన దృష్యా కమిషనర్ దృష్టికి వెళ్లడంతో స్పందించి బదిలీ వేటు వేశారు. కాగా ఆయన స్థానంలో ఏపీఆర్వోగా ఉన్న విష్ణువర్ధన్‌ను ఇన్‌చార్జి డీపీఆర్వోగా నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. విష్ణువర్ధన్ గతంలోనూ ఆదిలాబాద్ ఇన్‌చార్జి డీపీఆర్వోగా కొన్ని నెలల పాటు విధులు నిర్వర్తించారు. మళ్లీ ప్రస్తుతం ఇన్‌చార్జి డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-బేల

ఐకేపీ వీఓఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఐకేపీ వీఓఏ మండల అధ్యక్షులు ప్రవీణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీసీ ప్రమోద్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రంలో సెర్ప్ సంస్థలలో గత 20 సంవత్సరాలుగా గ్రామీణ స్థాయిలో 17,965 మంది వీఓఏలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే పేద, నిరుపేద మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తున్నామని అన్నారు.వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, ఏప్రిల్ 17వ తేదీలో జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ సమ్మెలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు దత్త్రాతి, గంగాధర్, గణేష్, దీపక్, ప్రఫుల్, సంజయ్, సల్మాన్, సతీష్ పాల్గొన్నారు.

మొరం తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ స్థలాల్లో మొరం తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం మండలంలోని టీవీటీ బోథ్ పిప్పల్‌ధరి, కరత్వాడ, గ్రామాలలో ప్రభుత్వ స్థలాలతో పాటు రైతులకు ప్రభుత్వం కేటాయించిన లావుని పట్టా, ఆసైన్డ్ భూములలో తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కరత్వాడ సమీపంలో తవ్వకాలు నిర్వహించిన 64 సర్వే నెంబర్‌లలో నీ 1000 క్యూబిక్ మీటర్ల తవ్వడం జరిగిందని తవ్వకాలు జరిపిన వారిపై ఫైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ఎక్కడైనా ప్రభుత్వ స్థలాల్లో మొరం తవ్వినట్లైతే రైతుల పట్టా పస్ పుస్తకం రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట మైనింగ్ ఏడీఏ రవి శంకర్, అర్ఐ దశరథ్, ఎంసీ ఉన్నారు.

ఐమాక్స్ వీధి దీపాల ఏర్పాటు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ నిధులతో నాలుగు రోడ్ల కూడలిలో గ్రామంలో 10 ఐమాక్స్ వీధి దీపాలను గురువారం గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో 10 వార్డులల్లో 10 ఐమాక్స్ వీధి దీపాలను గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వీటితో పాటు సీసీ రోడ్లను వేయడం జరిగిందని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి వార్డు సభ్యుల, గ్రామస్తుల సహకారంతో ముందుకు తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ఉపసర్పంచ్ కాంతారెడ్డి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు విలాస్, పరమేశ్వర్, ముత్తన్న, ప్రసాద్, సతీష్, లక్ష్మి ఉన్నారు.

ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మీ పథకం

నవతెలంగాణ-సారంగాపూర్

ఆడబిడ్డలకు వరం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 77 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ అల్లోల మురళీధర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్ రాంరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్లు నారాయణ రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎఎంసీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ చైర్మెన్ అయిటి చందు, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కడెం

మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన పెద్ది కళవ్వ, కడెం డ్యాం వద్ద గ్యాంగ్ మెన్ విశ్రాంత ఉద్యోగి పేరం శంకర్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షులు అజ్మీర శ్యామ్ నాయక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంబారిపేట్ గ్రామంలోని చుంచు ప్రభాకర్ గత పది రోజుల కింద రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన పరామర్శించారు. తొందరగా కొలుకోవాలని, తగు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెంకాల రాజన్న ఆరోగ్య సమస్యల వలన ఇంటి వద్ద ఉండి చికిత్స తీసుకుంటున్న విషయం తెలిసి అన్నివేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, కొండుకూరు సర్పంచ్ గొల్ల వేణుగోపాల్, అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఎంపీటీసీ కట్ల సింధుజ సాగర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిమాపక సేవల వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాల విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్నిమాపక సేవల వారోత్సవాల పోస్టర్లను, కరపత్రాలను గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ ఆవిష్కరించారు. ఈ నెల 14 నుండి 20వ తేదీవరకు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల వారోత్సవాల సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు, స్టేషన్ ఆఫీసర్ శివాజీ దుర్గే, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జన్నారం



యావత్ భారతదేశం గర్వించే విధంగా తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భారత జాతి రుణపడి ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజయ్ ధర్మ అన్నారు. గురువారం మండలంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంబడి సత్యం, నరేష్ సృజన్ రవి గౌడ్ పాల్గొన్నారు,

డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేట్ డ్రైవర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన చాపిడి సురేష్ ఎంపిక కాగా జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఆయనను డ్రైవర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ప్రభుత్వం కానీ యజమానులు కానీ ఆదుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తరపు నుండి భరోసా కల్పించే విధంగా పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పుల్కార్ సుధాకర్, సోనాజీ, మురలే సురేష్, గోపాల్, సంతోష్, ప్రదీప్ పాల్గొన్నారు.



నేటి జయంతి వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ 132వ జయంతి వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో అంబేద్కర్ సెంటర్ కమిటీ అధ్యక్షుడు బాపు జాడేతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉదయం లుంబిని దీక్ష భూమి నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళ్లు అర్పించిన తర్వాత అక్కడినుండి వివేకానంద చౌక్ మీదుగా లుంబిని దీక్ష భూమి వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. లుంబిని దీక్ష భూమిలో జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకలకు 500 మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వేడుకలకు హాజరయ్యే వారికి భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేగుంట కేశవ్, సెంటర్ కమిటీ కోశాధికారి ముంజం సాంబయ్య ప్రధాన కార్యదర్శి దుర్గం సుధాకర్, ఉపాధ్యక్షుడు వైరగడే పోశం, జాడి కృష్ణాజి లీలారాణి, మధుకర్, దీక్ష భూమి అధ్యక్షుడు ముంజం మనోహర్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేత

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం అందించే రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రారంభించారు. అనంతరం స్థానిక ముస్లిం మైనారిటీ సోదరులకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెన్నూరు నియోజకవర్గంలోని అన్ని ఈద్గాలు, దర్గాలను ముస్తాబు చేస్తామని అన్నారు. పేదింటి ముస్లిం మహిళల పెళ్లిల్లకు రూ.లక్షా 116 సాయం ఒంటరి ముస్లిం మహిళలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు మెయింటెనెన్సు అలవెన్సు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ బ్యాంకు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని ఆసిఫాబాద్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ కాజా మొయినుద్దీన్ అన్నారు. బ్రాంచ్ ఆవరణలో బ్యాంకు 129వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బ్యాంకు స్కీములకు సంబంధించి కళాజాత బృందం ద్వారా ఖాతాదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్డ్ లోన్ గ్రాముకు 4,500 వరకు ఇస్తూ వడ్డీ రేటు 8.5 శాతం వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఖాతాదారులకు అత్యవసర సేవలతో పాటు ప్రభుత్వ విధానాలను పక్కాగా పాటిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ డి.రాజ్ కుమార్, క్యాషియర్ ఏ.సుధీర్, అటెండర్ శ్రీకాంత్, కళాజాత బృందం సభ్యులు విజయ్, తేజ పాల్గొన్నారు.

జీఎస్ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని స్థానిక ఎ-జోన్ అల్లూరి సీతారామరాజునగర్ కాలనీకి చెందిన 20 మంది ముస్లిం నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని రవీంద్రఖని రైల్వేస్టేషన్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేసి అంబలి పంపిణీ చేశారు. పట్టణ పరిధిలోని పులిమడుగు గ్రామానికి చెందిన కొంతమంది నిరుపేద గిరిజనుల కుటుంబాలకు 2.50క్వింటాళ్ల బియ్యాన్ని నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ నాయకులు ఎండీ అక్బర్ అలీ, ఫౌండేషన్ సభ్యులు రాజు, ప్రకాష్, ఉప్పులపు సురేష్, రమేష్, వంశీ, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ వర్ధంతి

నవతెలంగాణ-మంచిర్యాల

బీసీలకు రిజర్వేషన్లు సాధించిన మహనీయుడు బీపీ మండల్‌అని పేర్కొంటూ ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి పట్టణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ మండల సిఫారసులను అమలు చేయాలని గత కొన్ని సంవత్సరాల నుంచి బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మొండిగా వ్యవహరిస్తోందనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా బీపీ మండల్ సిఫారసులపై రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువ జాగతి అధ్యక్షుడు మంచర్ల సదానందం, పట్టణ కార్యదర్శి వెన్నంపల్లి రవీందర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కుల రాజు, బీసీ సీనియర్ నాయకులు గందె శ్రీ తిరుపతి, జక్కం రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని, అఖిల భారత ప్రజాసంఘాల భూ సంరక్షణ కమిటీ మండల కన్వీనర్ జేల్లా భీమయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేరుల సమావేశంలో ఆమన మాట్లాడారు. మండలంలోని సింగరాయపేట సర్వే నెంబర్ 147/6, 147/11లో గల ఏడున్నర ఎకరాల భూమి, కిష్టాపూర్ సర్వేనెంబర్ 139లో రెండు ఎకరాలు, భూముల పట్టాలను జిల్లా కలెక్టర్ రద్దు చేసినట్లు తెలిపారు. గతంలో ఈ ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేసుకోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడంతో, స్పందించిన మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ తాసిల్దార్ కిషన్‌లు ఆ పట్టాలను రద్దుచేసి, స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు ఎవరు స్వాధీనం చేసుకున్న వారిపై భూ సంరక్షణ కమిటీ పోరాటం చేస్తుందన్నారు. ఇంకా మండలంలో చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జా, అయ్యాయని, వాటిని రోజుకు ఒకటి చొప్పున బయటికి తీసి అధికారులకు విన్నవించి ప్రభుత్వమే స్వాధీనం చేసుకునే విధంగా పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ కో కన్వీనర్లు, దాసరి తిరుపతి ముత్యం రాజన్న పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీని నియమించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2018 పీఆర్సీ గడువు జూన్ 30తో ముగియనున్నందున పీఆర్సీ 2023ను వెంటనే నియమించి ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతనవేతన స్థిరీకరణ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ నాయకుడు ఐక్య గురుకులాల రాష్ట్ర కార్యదర్శి దూలం ఎల్లయ్యతో కలిసి టీఎస్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2018 పీఆర్సీని ఆలస్యంగా 2020 నుంచి అమలు చేయడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా చాలా నష్టపోయారని, 2023 పీఆర్సీని సకాలంలో నియమించి వేతన స్థిరీకరణ చేయాలని కోరారు. గత పీఆర్సీలోని లోటుపాట్లను సరిచేయాలని, గత పీఆర్సీ సిఫార్సు చేసిన అంశాలపై అన్ని అనుబంధ జీవోలను విడుదల చేయాలని, 2023 పీఆర్సీని ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా చేయాలని కోరారు. బదిలీలు పదోన్నతులపై కోర్టులో ఉన్న అన్ని కేసులను పరిష్కరించి సజావుగా జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, ఈ-కుబేర్ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులతో పాటు, కేజీబీవీ యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్ షిండే, కాంపెల్లి ఉషన్న, సింగతి ఉపేందర్, కోట తిరుపతి, నవీన్ కుమార్, జాదవ్ సుభాష్, జాడే కిరణ్ కుమార్, మడావి గణపతి, మోతే శ్రీనివాస్ పాల్గొన్నారు.





మంచిర్యాల : టీఎస్ యూటీఎఫ్ పదవ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జెండాను ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.ఆగచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ బదిలీలపై హైకోర్టులో నడుస్తున్న కేసు జూన్ 13కు వాయిదా పడటం విచారకరమని, కేసు వాయిదాను ఈ నెలాఖరులోగా ముందుకు జరిపే విధంగా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేయాలని కోరారు. వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అది సాధ్యం కాని పక్షంలో తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు అయినా కల్పించాలని కోరారు. ఎనిమిదేళ్ళుగా పదోన్నతులు లేక అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారని అన్నారు. పాఠశాలల్లో ఖాళీల వలన విద్యార్థులకు నష్టం జరుగుతోందని, పదోన్నతులు ఇస్తేనే నియామకాలకు ఖాళీలపై స్పష్టత వస్తుందని వివరించారు.

కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.కిరణ్ కుమార్, మంచిర్యాల మండలం అధ్యక్షుడు ఎం.బారికి రావు, జిల్లా కమిటీ సభ్యులు బి.రవి కుమార్, దుర్గయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

దళితుల సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఓట్ల కోసం అంబేద్కర్ వాదాన్ని వాడుకుంటున్న కేసీఆర్



నవతెలంగాణ-నస్పూర్

దళితుల సంక్షేమంపై సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బహిరంగ లేఖ రాశారు. గురువారం ఆయన ప్రగతి స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజున అంబేద్కర్ విగ్రహం పెడతామని హామీ ఇచ్చి పదేళ్ల తర్వాత ఎన్నికల కోసం విగ్రహావిష్కరణ చేస్తున్నారని ఆరోపించారు. సమాజ ఉద్ధరణకు అంబేద్కర్ ఆలోచన విధానాలను అవలంభించాల్సిన పాలకులు ఓట్లు ఓట్లు రాబట్టేందుకు వాడుకోవటం దుర్మార్గం అన్నారు. దళిత, గిరిజనుల, పేద వర్గాలకు మాయమాటలు చెప్పి ఓట్లు పొంది వారి జీవితాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. టీఆర్ఎస్ ఏర్పాటు చేసినప్పటి నుంచి హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జయంతి, వర్ధంతిల సందర్భంగా ఏ ఒక్క సంవత్సరమైనా కేసీఆర్ పూలదండ వేశారా ప్రశ్నించారు. అధికారికంగా జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారా అని ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు హాజరై దళిత గిరిజనుల అభ్యున్నతికి ఏమైనా నిధులు ప్రకటించారా అని అన్నారు. దళిత గిరిజనులను అవమానించిన సీఎం కేసీఆర్ ఇప్పుడు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టాపించడం ఎన్నికల ఎత్తుగడే అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి మళ్ళించారని పేర్కొన్నారు. దళిత గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ దయా దక్షిణ్యం అవసరంలేదని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దళిత గిరిజనులకు ఖర్చుపెడితే అభివృద్ధి చెందుతారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, ఐటీడీఏలు విధ్వంసం అయ్యాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దళిత బంధుకు కేటాయించిన రూ.17,500 కోట్లు ఏడాది పూర్తి అయిన విడుదల చేయకపోవడం ఇంతకంటే దుర్మార్గం ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. కేసీఆర్ వేస్తున్న ఎన్నికల ఎత్తుగడలకు మరోసారి మోసపోవద్దని అన్నారు. దళితుల జీవితాల్లో వెలుగు నింపింది కాంగ్రెస్ పరిపాలన అని ఇందిరమ్మ రాజ్యం వస్తేనే తెలంగాణ దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో ఎఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, సంపత్ కుమార్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ కన్వీనర్ అజ్మతుల్లా, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్, డీసీసీ అధ్యక్షులు కే.సురేఖ, పీసీసీ నాయకులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మున్సిపాలిటీలోని 20వ వార్డు ఎస్ఆర్ పాఠశాలలో గురువారం ప్రారంభించిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తనిఖీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం శిబిరంలో ఏర్పాటు చేసిన వసతులు, రికార్డులను ఆయన తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు వార్డులు పూర్తయ్యేంతవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బోయినపల్లి అనిల్‌రావు పాల్గొన్నారు.

సమాధులను తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పోనకల్ గ్రామములోని సర్వే నెం.366, 367లో గల తమ వంశస్థుల సమాదులను బుధవారం రాత్రి చిట్యాల సతన్న అనే వ్యక్తి జేసీబీ ద్వారా తొలగించారని ఆయనపై చర్యలు తీసుకోవాలని పోనకల్ గ్రామస్తులు నాగిశెట్టి స్వామి, నాగిశెట్టి రవి, నాగిశెట్టి చిన్న, ముద్రకోళ్ల రవి, గుడ్ల రాజన్న డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం పిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల ముత్తాతల కాలం నుంచి పూసవేర్ల సంఘానికి చెందిన ఆ స్థలాన్ని అందులో ఉన్న సమాధులను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సత్తన్నపై క్రిమినల్ కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కనికారం అశోక్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన టీహెచ్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాళ్లబండి విజయ్ కుమార్ గురువారం అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచం అందజేశారు. రానున్న రోజుల్లో జిల్లాలో తమ సేవా సమితి ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీహెచ్ఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బాబుగౌడ్ ఉన్నారు.

బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరించడమే లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ మతతత్వ సిద్ధాంతాలను అడ్డం పెట్టుకొని పరిపాలన చేస్తూ ఎన్నో రకాల వైఫల్యాలు పొందుతుందని వాటన్నింటినీ ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకో హటావో దేశ్‌కో బచావో అనే నినాదంతో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రైతులకు, కార్మికులకు అనేక విధాలుగా నష్టం చేసిందని, కార్పొరేట్లకు మోడీ ఊడిగం చేస్తున్నారని అన్నారు. పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పోడుభూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చి, చట్టాన్ని చేయవలసిన అవసరం ఉందని అన్నారు. గిరిజన పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే నియమించాలని సింగరేణి, ఆర్టీసీ, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, పాఠశాలలు, కళాశాలలో ఇతర పరిశ్రమలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు అందరిని పర్మనెంట్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్ల అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని, కొత్త రేషన్ కార్డులు అందిస్తూ గతంలో మాదిరి 14 రకాల నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని అన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ లక్ష వరకు ఒకే దఫాగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని మండలాల్లో చేపడుతున్న ఇంటింటికి సీపీఐ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్, పిడుగు శంకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టీ.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, నాయకులు హేమాజీ, ఎల్.దివాకర్, మహిళ సంఘం నాయకురాలు కొమురక్క పాల్గొన్నారు.

చట్ట సభలో రిజర్వేషన్లపై కాంగ్రెస్ పోరాటం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ చట్టసభల్లో పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలోనే చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించవలసిన అగ్రవర్ణ నాయకులైన అప్పటి నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మొరార్జీ దేశాయ్, లాల్ బహుదూర్ శాస్త్రిలు తమ అధికార అలసత్వంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి, బీసీల మధ్య మా అగ్రవర్ణ, ధనిక కులాల మధ్యనే రాజకీయ పోటీ ఉండాలని భావించి బీసీ కులాల వారికి రాజకీయ అధికారం దక్కకుండా చేశారన్నారు. అది 75 ఏళ్లుగా ఎంతమంది అగ్రవర్ణాల నాయకులు అధికారం చేపడుతూ వస్తున్నారు. అంతమంది అదే పద్ధతిని పాటిస్తూ బీసీలను రాజకీయ ఆర్థిక సాంఘిక రంగాల్లో అనగదొక్కుతూ వస్తున్నారన్నరు. ఇప్పుడు బీసీ కులాల సమాజం చైతన్యవంతమై తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నదన్నారు. ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నారో, అక్కడే అధికారం సాధించుకోవాలని తపనతో అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, కాసెట్టి లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, గంగాధర్, మూల భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్

భారత రాజ్యాంగ నిర్మాత బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి అన్నారు. గురువారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండంలోని మాదారం టౌన్‌షిప్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామగౌని మహీధర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, మండల ప్రధాన కార్యదర్శి దూడపాక భరత్, మండల అధికార ప్రతినిధి సిద్ధం మల్లేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి గజ్జెటి.శేఖర్, పుప్పాల మహేష్ పాల్గొన్నారు.



గెల్లు శ్రీనివాస్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గెల్లు శ్రీనివాస్‌ను గురువారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర, అధ్యక్షుడు సాయిని ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓయూలో తెలంగాణ ఉద్యమ సమయంలో, కలిసి పనిచేసిన సహ మిత్రుడు ఇంత పెద్ద స్థాయికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాలని హితవు పలికారు.